తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
వరంగల్ - ఆదిలాబాద్
హన్మకొండ | జనగాం | ములుగు | నిర్మల్ | మంచిర్యాల
ప్రాంత: జయశంకర్ భూపాలపల్లి | కొమురం భీం అసిఫాబాద్
ములుగు
బుధవారం
4 నవంబర్ 2026
పేజీలు - 12



గ్రామాల అభివృద్ధే ధ్యేయం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు
- చిట్యాల మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో పేదల సంక్షేమానికి పెద్దపీట

చిట్యాల, నవంబర్ 03(జనం సాక్షి): గ్రామాల అభివృద్ధే ప్రధాన ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని భూపాల పల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు స్పష్టం చేశారు. మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని పలు గ్రామాల్లో ఆయన విస్తృతంగా పర్యటించి, రూ 2.14 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, మహిళా సమాఖ్య సంఘ భవనాల నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రజా పాలన ప్రభుత్వంలో పేదల సంక్షేమం, గ్రామీణ ప్రాంతాల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అమలవుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వసంతరావు, ఏలేటి రామయ్యపల్లి సర్పంచ్ కొడారి అశోక్, నాయకులు డబ్బేట అనీల్, ముకిరాల మధు వంశీ, దొడ్డి కిష్టయ్య, గూట్ల తిరుపతి, గంగాధర్ రవీందర్లతో పాటు జిల్లా, మండల స్థాయి అధికారులు, పలు గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ దీపాల పేరుతో వెలుగుతున్న దోపిడీ!



- చీకట్లో మగ్గుతున్న గ్రామాలు
- రికార్డుల్లో మోగుతున్న బిల్లులు
- అధికారుల అండతో సర్పంచుల దోపిడీ
- పట్టించుకోని జిల్లా అధికార యంత్రాంగం

వెంకటాపూర్(రామప్ప), నవంబర్ 03(జనం సాక్షి): వెంకటాపూర్ మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో విద్యుత్ దీపాల పేరుతో జరుగుతున్న దోపిడీకి సంబంధించి సంచలన వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. పలు గ్రామాల్లో రాత్రి పూట అడుగు పెడితే చీకటి తప్ప వెలుగు కనిపించటం లేదు.వీధుల్లో నడవాలంటే టార్చ్ లైట్ పట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.వీధుల్లో విద్యుత్ దీపాలు వెలగకున్న పట్టించుకునే నాథుడు కరువయ్యారు. కానీ,పంచాయతీ రికార్డుల్లో మాత్రం ప్రతి నెలా విద్యుత్ దీపాలు వెలిగినట్లు, కొత్త విద్యుత్ దీపాలు వేసినట్లు, పాత విద్యుత్ దీపాలు రిపేర్ చేసినట్లు లెక్కలు కనిపిస్తున్నాయి.

వార్త మెయిన్ 7లో

యువత అన్ని రంగాలలో రాణించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల ప్రతినిధి, నవంబర్ 3 (జనంసాక్షి) : యువత అన్ని రంగాలలో ముందుండాలని, దేశ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవాలు--2026 కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థాయి యువజనోత్సవాలలో భాగంగా జానపద నృత్యాలు, జానపద గీతాలు, వీధి నాటకాలు, చిత్రలేఖనం, కవితా పోటీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ పోటీలలో యువతీ, యువకులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారని, ఇలాంటి పోటీలు యువతలో దాగి ఉన్న సృజనాత్మకత, కళా నైపుణ్యాలను వెలికితీసేందుకు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. జిల్లా స్థాయిలో ఆయా విభాగాలలో ప్రథమ స్థానంలో నిలిచిన విజేతలకు రాష్ట్ర స్థాయిలో నిర్వహించే పోటీలలో పాల్గొనే అవకాశం కల్పించడం జరుగుతుందని, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారు జాతీయ స్థాయిలో పాల్గొనే అవకాశం పొందుతారని తెలిపారు. జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి పురస్కారాలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. యువత ఈ



అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య మాట్లాడుతూ యువతలోని సృజనాత్మకత, కళా నైపుణ్యాలను వెలికితీసేందుకు యువజనోత్సవాలు మంచి వేదికగా నిలుస్తాయని తెలిపారు. యువతీ యువకులు జిల్లా, రాష్ట్ర స్థాయిలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు మాట్లాడుతూ జిల్లా స్థాయి యువజనోత్సవాలలో పాల్గొంటున్న విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచి, రాష్ట్ర, జాతీయ స్థాయిలలో రాణించాలని ఆకాంక్షించారు. యువత తమలోని నైపుణ్యాలను పెంపొందించుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో అధికారులు, సామాజిక సేవా కార్యక్రమాలలో విశేషంగా సేవలందించిన యువజన సంఘాల ప్రతినిధులను సన్మానించారు. అనంతరం వివిధ కేటగిరీలలో పోటీలలో పాల్గొని మొదటి మూడు స్థానాలలో నిలిచిన విజేతలకు జ్ఞాపికలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి హనుమంత రెడ్డి, షెడ్యూల్డ్ కులములు అభివృద్ధి శాఖ అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా మాధ్యమిక విద్యాధికారి అంజయ్య, జిల్లా ఉపాధి కల్పనా శాఖ అధికారి రవికృష్ణ, సంబంధిత అధికారులు, యువతీ, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రాజెక్టుల పేరుతో ఆదివాసీల భూములను లాక్కోవద్దు

- అదనపు జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేసిన
- ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి
- వందల ఏళ్లుగా పట్టించుకోని ప్రభుత్వాలు..

నూగూర్ వెంకటాపురం నవంబర్ 03(జనం సాక్షి) : వందల ఏళ్లుగా అడవులను కొండ లను నమ్ముకొని బ్రతుకుతున్న పెనుగోలు ఆదివాసీల సాగు భూములు ప్రాజెక్ట్ ల పేరుతో తీసుకోవద్దని పెనుగోలు ఆదివా సీలు ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి ఆధ్వర్యంలో ములుగు అదనపు జిల్లా కలెక్టర్ మహేందర్ జీ ని కలిసి వినతిపత్రం అందజేసినట్టు మీడియకు తెలిపారు. మంగళవారం ములుగు కలెక్టెట్ లో కలిసినట్టు నర్సింహా మూర్తి తెలిపారు. రెవిన్యూ అధికారులు పెసా గ్రామసభలను, 1/59, 1/70, అటవీ హక్కుల గుర్తింపు చట్టాలను గౌరవించకుండా తమ ఇష్టాను సారంగా మోడీ కుంట ప్రాజెక్ట్ కు భూములు మిగతా 11లో..

అమరవీరుల ఆశయాలను సాధిద్దాం

జగన్నాయకులగూడెం,లక్ష్మీపురంలలో సంస్మరణ సభలు
సీపిఐ(ఎంఎల్)న్యూడెమోక్రసి జిల్లా కార్యదర్శి కామ్రేడ్ మండల వెంకన్న



గూడూరు,నవంబర్03(జనంసాక్షి): సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రస్ పార్టీ ఆధ్వర్యంలో నవంబర్ 1నుండి,9వరకు నిర్వహిస్తున్న అమరవీరుల సంస్మరణ సభలలో జగన్ నాయకులగూడెంలో కామ్రేడ్ పెనక వెంకన్న విక్రం, లక్ష్మీపురం గ్రామంలో ఎలా వెంకటయ్య ఎలా రాముల ల స్మారక సభలను గజ్జి లింగన్న,ఎలా ఉపేందర్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు.ఈ సభకు సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ మండల వెంకన్న ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ భూమికోసం, బుక్తి కోసం,ఈ దేశ విముక్తి కోసం నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతం కోసం దోపిడీ పీడన అసమానతలు లేని నూతన సమాజం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల ఆశయాలను కొనసాగించాలని వారు అన్నారు.నేడు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా అమరవీరులు చూపిన బాటల్లో ఐక్యంగా ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్)న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు కామ్రేడ్ పుల్లన్న,హలవత్ లింగ్య,అచ్చన్న, లింగన్న, కొటేం వజ్జన్న, కడబోయిన నర్సయ్య,వేముల యాకంతం,అడ్డురి వెంకన్న ఉపేందర్, ఒర్రె వెంకన్న, సమ్మయ్య, ఎలా అనిత, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కళాకారులు మౌనిక,యాకయ్యలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ-ఎమ్మెల్యే అనిల్ జాదవ్



నెరడిగొండ నవంబర్3(జనంసాక్షి): రాజులతాండ గ్రామంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని,తాండ నుంచి పొచ్చర వరకు రోడ్డు సౌకర్యం కల్పిస్తున్నామని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు.మంగళవారం రోజునమండలంలోని బుద్దికొండ గ్రామ పంచాయతీ పరిధిలో గల రాజులతాండ గ్రామంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పర్యటించారు.ఈ సందర్భంగా గ్రామంలో రూ.28 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజులతాండ చిన్న గ్రామమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తానని గ్రామస్తులకు భరోసా కల్పించారు.రాజులతాండ నుంచి పొచ్చర వరకు బీటీ రోడ్డునిర్మించబోతున్నామని తెలిపారు. గ్రామస్తులు అందరూ కలసిమెలసి ఉండలాని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ ఎంపిపి రాథోడ్ సజన్ నాయకులు వివిధ గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్
ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులుగా మహేందర్ గౌడ్



వెంకటాపూర్ (రామప్ప), నవంబర్ 03(జనం సాక్షి):- ఉమ్మడి వరంగల్ జిల్లా ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులుగా వెంకటాపూర్ మండల కేంద్రానికి చెందిన శ్రీరామ స్టూడియో దేశిని మహేందర్ గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ములుగు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా నూతనంగా ఉపాధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించిన మహేందర్ గౌడ్ మాట్లాడుతూ... తమపై నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించిన జిల్లా అధ్యక్షుడు గాదె లింగమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ సునీల్ కుమార్, జిల్లా ఆర్గనైజర్ పిల్లలమర్రి రాము, ములుగు జిల్లా మాజీ అధ్యక్షులు కందుల రవి, సీనియర్ ఫోటో గ్రాఫర్లు మహావీర్ శ్రీనివాస్ గౌడ్, సంతోష్, సదానందం, వెంకటట్, రావిరజ, దేవేందర్, యుగేందర్, మరియు ఇతర సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఫోటోగ్రాఫర్ల హక్కుల సాధనకు, వారి సంక్షేమానికి నిరంతరం కట్టుబడి ఉంటామని ఈ సందర్భంగా అయన స్పష్టం చేశారు.

ఏనుమాముల మార్కెట్లో
పత్తి ధర పతనం.. రైతుల్లో ఆందోళన

గీసుకొండ మండలం, నవంబర 3, (జనం సాక్షి) గీసుకొండ మండలం: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో పత్తి ధరలు రోజురోజుకూ తగ్గుముఖం పడుతుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత నెలలో క్వింటాల్ పత్తికి గరిష్ఠంగా రూ.9,500 ధర పలకగా.. ప్రస్తుతం రూ.8,790కు పడిపోయింది. దీంతో పత్తి రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. మార్కెట్‌కు పత్తి అమ్మకాలు పెరుగుతున్న నేపథ్యంలో వ్యాపారులు ధరలు తగ్గిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వారం రోజుల క్రితం వరకు మార్కెట్‌కు రోజుకు 2 వేల బస్తాలకు మించి పత్తి అమ్మకాలకు రాకపోగా.. ప్రస్తుతం ఆ సంఖ్య రెట్టింపై సుమారు 4 వేల బస్తాల పత్తి అమ్మకాల కోసం మార్కెట్‌కు చేరుతోంది. పత్తి రాక పెరుగుతున్న కొద్దీ ధరలు తగ్గుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట సాగు కోసం పెట్టిన పెట్టుబడులు, కూలీ ఖర్చులు పెరిగిన నేపథ్యంలో ధరలు తగ్గడం తమకు నష్టాన్ని కలిగిస్తోందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి పత్తికి గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు.

ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్‌ను
కలిసిన పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు



చెన్నారావుపేట, నవంబర్ 3 (జనం సాక్షి): నూతనంగా బాధ్యతలు చేపట్టిన పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్‌ను పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు మరిదాపూర్వకంగా కలిశారు. మంగళవారం ఆయనకు పూల బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టి జి ఈ జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి, టీపీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీకాంత్ గౌడ్, వరంగల్ జిల్లా అధ్యక్షులు కృష్ణంరాజు, చెన్నారావుపేట మండల అధ్యక్షులు గొడిశాల వికాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి కత్తెనపల్లి రాజులు పంచాయతీ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందించినట్లు తెలిపారు.

రామప్ప పరిరక్షణలో వాలంటీర్లు ముఖ్య భూమిక పోషించాలి

జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎం. సంపత్ రావు
పాలంపేటలో ముగిసిన వరల్డ్ హెరిటేజ్ వాలంటరీ క్యాంప్



వెంకటాపూర్ (రామప్ప), నవంబర్ 03(జనం సాక్షి):- ప్రపంచ వారసత్వ సంపద కలిగిన రామప్ప దేవాలయ పరిరక్షణలో వాలంటీర్లు ముఖ్య భూమిక పోషించాలని ములుగు జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎం. సంపత్ రావు అన్నారు. మంగళవారం వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయ ప్రాంగణంలో నిర్వహించిన వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ క్యాంప్--2026 ముగింపు కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పర్యాటక శాఖ నోడల్ అధికారి ధర్మనాయక్, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ప్రతినిధులు ప్రొఫెసర్ ఎం. పాండురంగారావు, శ్రీధర్ రావులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. చరిత్ర, పురావస్తు, వారసత్వ కట్టడాల సంరక్షణపై ఆసక్తితో శిక్షణకు హాజరైన వాలంటీర్లను అభినందించారు. రామప్ప దేవాలయ విశిష్టతను, శిక్షణలో తెలుసుకున్న అంశాలను మరింత మందికి తెలియజేయాలని సూచించారు. వారసత్వ కట్టడాల పరిరక్షణలో యువత చురుకైన పాత్ర పోషించాలని అన్నారు. అదేవిధంగా పర్యాటక శాఖ నోడల్ అధికారి ధర్మనాయక్ మాట్లాడుతూ.. ఇటువంటి శిక్షణ శిబిరాలు యువతకు కెరీర్‌పరంగా ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. వివిధ ప్రాంతాల చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, జీవనశైలిని తెలుసుకునేందుకు ఇవి అవకాశం కల్పిస్తాయన్నారు. ఇక్కడ నేర్చుకున్న అంశాలను ఇతరులకు తెలియజేస్తూ కాకతీయుల కీర్తిని ప్రపంచానికి చాటేలా వాలంటీర్లు కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ఇమ్మడి భాస్కర్, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ సభ్యులు శ్రీనివాస్, స్థానిక సర్పంచ్ చల్లగొండ రాజు,పర్యాటక శాఖ గైడ్లు గోరంటల విజయ్ కుమార్, వెంకటేష్, రాష్ట్ర పురావస్తు శాఖ ఫోర్‌మన్ బాబు, టూరిస్ట్ పోలీసులు అరుణ్, భద్రు, సంబంధిత శాఖల సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



ఏక్తా దివస్‌లో పాల్గొనడం మండలానికే గర్వకారణం
గూడూరు ప్రభుత్వ ఉపాధ్యాయుడు గోపినాథ్‌ను శాలువాతో
సత్కారించిన తోటి ఉపాధ్యాయులు



గూడూరు, నవంబర్03 (జనంసాక్షి): గూడూరు మండలం నుండి ప్రభుత్వ ఉపాధ్యాయుడైన వి.గోపినాథ్ గుజరాత్ లో ఎక్తా దివస్ కార్యక్రమంలో పాల్గొనడం ఉపాధ్యాయులకే కాకుండా గూడూరు మండలానికే గర్వకారణమని వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.మంగళవారం గూడూరు మండలం తీగలవేణిలో కాంప్లెక్స్ హెడ్మాస్టర్ ఫరూక్ మరియు కాంప్లెక్స్ సెక్రటరీ నమల్ వార్ ఆధ్వర్యంలో సమావేశం జరిగినది. ఈ సమావేశంలో మండలంలోని వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొని, గూడూరు మండలం నుండి ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఒక్కరూ మారిన చాలు పొండేషన్ వ్యవస్థాపకులు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు వి. గోపినాథ్ కేంద్ర ప్రభుత్వ అధికారిక జాతీయ కార్యక్రమానికి ఎంపికై పాల్గొనడం మన మండలానికే గర్వకారణమని కాంప్లెక్స్ ఉపాధ్యాయులు కొనియాడారు.అనంతరం డా.గోపీనాథ్ ను శాలువాతో,ఘనంగా సత్కారించి అభినందనలు తెలిపారు.ప్రధాని మోడీ సమక్షంలో జరిగిన ఈ జాతీయ కార్యక్రమ విశేషాలను,ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో టీజీ టిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆంగోత్ ధర్మానాయక్, డిటిఎఫ్ మండల అధ్యక్షులు దూప్ సింగ్,పిఆర్టియు జిల్లా నాయకులు నీలం రమేష్, టిపిటిఎఫ్ మండల నాయకులు ఉదయ్ కిరణ్, మండలంలోని అన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులు అజ్మీర రాముడు,ధరావత నెహ్రూ, యాకూబ్,పొగాకు రామచంద్రయ్య,నిఖిల్, సిఆర్పి గట్టు రజిత,రేణుక ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ బెల్లంపల్లి కోర్టు కమిటీ ఎన్నిక



బెల్లంపల్లి, నవంబర్ 3, (జనంసాక్షి) ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ బెల్లంపల్లి కోర్టు కమిటీ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా న్యాయవాది మాసు సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా మురళి శ్రావణ్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా జాడి రాజేష్, దేవరాజ్, సహాయ కార్యదర్శులుగా అనిల్ కుమార్, జూబేర్, కోశాధికారిగా కుమార్, కమిటీ సభ్యులుగా గొర్లపల్లి రమేష్, సజ్జనపు సంతోష్, కందుల సందీప్, బుర్సా రమేష్, దాట్ల సతీష్, మద్దిబోయిన శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా సీనియర్ న్యాయవాది, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు కొయ్యల ఏమాజి, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సబ్బని సాయికుమార్ వ్యవహరించారు.

మహిళా కమిటీ అధ్యక్షురాలిగా సౌమ్య ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ బెల్లంపల్లి కోర్టు మహిళా కమిటీ కన్వీనర్ గా తౌటం సౌమ్య, కోకన్వీనర్లుగా పీక మమత, అరకొండ లావణ్య, దుర్గం గౌతమి, కమిటీ సభ్యులుగా ఉమారాణి, స్వర్ణలత ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి కొయ్యల ఏమాజి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా ఎన్నికైన సభ్యులను అభినందించారు. న్యాయవాదుల సమస్యల సాధన కోసం కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎన్నికైన నాయకులను శాలువాలతో ఘనంగా సన్మానించారు.

పేద మహిళలను లక్షాధికారులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

సీసీలు, వీవోఏలకు శిక్షణ కార్యక్రమం



దిలావర్‌పూర్, నవంబర్ 03 (జనం సాక్షి): గ్రామీణ పేద మహిళలకు స్థిరమైన జీవనోపాధులు కల్పించి, వారి ఆదాయాన్ని పెంపొందించడం ద్వారా లక్షాధికారులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా చైతన్య మండల సమాఖ్య భవనంలో దిలావర్‌పూర్, నర్సాపూర్ మండలాల సీసీలు, వీవోఏలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామీణాభివృద్ధి అధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి మాట్లాడుతూ, శిక్షణను సద్వినియోగం చేసుకొని పేద మహిళలను ప్రణాళికాబద్ధంగా లక్షాధికారులుగా తీర్చిదిద్దాలని సూచించారు. మహిళలకు అవసరమైన నైపుణ్య శిక్షణ అందించడంతో పాటు, క్రమశిక్షణ, మెరుగైన జీవనశైలిని అలవర్చుకోవాలని పేర్కొన్నారు. మహిళలు స్వయం ఉపాధి మార్గాలను అభివృద్ధి చేసుకొని వ్యాపారవేత్తలుగా ఎదిగేందుకు అవసరమైన ఆర్థిక సహకారం, ఆదాయాభివృద్ధి కార్యక్రమాలను అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్, డీపీఎం ఏనుగు శోభారాణి, ఏపీఎం బోసు, సీసీ శ్రీనివాస్, వీవోఏలు సక్కారం, గంగామణితో పాటు రెండు మండలాల సీసీలు, వీవోఏలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జన్నారంలో విద్యార్థులకు అగ్నిప్రమాదాలపై అవగాహన సదస్సు



జన్నారం, నవంబర్ 3 (జనం సాక్షి): జన్నారం మండల కేంద్రంలోని పాఠశాలలో విద్యార్థులకు అగ్నిప్రమాదాల నివారణ మరియు ముందస్తు జాగ్రత్తలపై మంగళవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల అగ్నిమాపక అధికారి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల్లో, ఇంట్లో లేదా జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాలలో అగ్నిప్రమాదాలు జరగకుండా ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి అనేదానిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఒకవేళ అనుకోకుండా ప్రమాదాలు సంభవిస్తే ఏ విధంగా స్పందించాలి, ఎలాంటి నష్టాలు జరగకుండా ఏలా వ్యవహరించాలి అనే విషయాలను వివరించారు. అలాగే, ప్రమాదం సంభవించినప్పుడు వైద్య మరియు పోలీసు సిబ్బందితో పాటు అగ్నిమాపక శాఖ నుండి ఎలాంటి సహాయ సహకారాలు పొందవచ్చో విద్యార్థులకు క్షుణ్ణంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు అడిగిన పలు సందేహాలను అగ్నిమాపక సిబ్బంది నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల అగ్నిమాపక శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విధుల పట్ల అంకితభావంతో పనిచేస్తున్న ఉపాధ్యాయుల కృషి అభినందనీయం

జిల్లా కలెక్టర్ కె. హరిత



రెబ్బెన,నవంబర్03(జనంసాక్షి): విధుల పట్ల అంకితభావంతో పనిచేస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించడంతో పాటు, ప్రభుత్వం నిర్దేశించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల కృషి అభినందనీయమని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. మంగళవారం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఇటీవల పాఠశాల ఉపాధ్యాయుల వ్యవహారశైలిపై విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు అందిన నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యాబోధన జరుగుతున్న తీరును, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను, ఉపాధ్యాయుల పనితీరును స్వయంగా పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగి వారి పఠనా సామర్థ్యం, విషయ పరిజ్ఞానాన్ని పరీక్షించారు. విద్యార్థులు చక్కగా చదవడం, ఉపాధ్యాయులు అర్థమయ్యే రీతిలో బోధించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాలలో నిర్వహిస్తున్న కంప్యూటర్ తరగతులను పరిశీలించారు. ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం అందించడం అభినందనీయమని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించడం విద్యార్థుల భవిష్యత్తుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, భోజనం నాణ్యత, రుచి, పరిశుభ్రతను గమనించారు. ప్రతిరోజూ నాణ్యమైన, రుచికరమైన, పౌష్టికాహారాన్ని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. తదుపరి విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమై పాఠశాలలో విద్యాబోధన, ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రతిరోజూ క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని సూచించారు. విద్యార్థుల విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల భాగస్వామ్యం కూడా ఎంతో కీలకమని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్య, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణంగా బోధన అందిస్తూ, వారిలో చదువుపై ఆసక్తిని పెంపొందించాలని సూచించారు. విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించడం ద్వారా విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాలకు ముందస్తు అనుమతులు తప్పనిసరి



రామకృష్ణాపూర్, నవంబర్ 03(జనంసాక్షి): దీపావళి పండుగ సందర్భంగా క్యాతనపల్లి పురపాలక సంఘ పరిధిలో తాత్కాలిక బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేయదలచిన వ్యాపారులు సంబంధిత శాఖల నుంచి ముందస్తు అనుమతులు తప్పనిసరిగా పొందాలని క్యాతనపల్లి కమీషనర్ మురళీకృష్ణ సూచించారు. జిల్లా కలెక్టర్ జారీ చేసిన సర్కులర్ మేరకు బాణసంచా దుకాణాల ఏర్పాటుకు అనుమతులు తీసుకోవాలని పేర్కొన్నారు. ఇళ్ల మధ్యలో, నివాస ప్రాంతాల్లో, ప్రజలకు ప్రమాదం కలిగించే ప్రదేశాల్లో దుకాణాలు ఏర్పాటు చేయరాదని స్పష్టం చేశారు. అనుమతించిన నిర్దేశిత స్థలాల్లోనే దుకాణాలు ఏర్పాటు చేయాలన్నారు. దుకాణాలు ఏర్పాటు చేయదలచిన వ్యాపారులు సంబంధిత స్థలానికి సంబంధించిన మ్యాప్ (సైట్ ప్లాన్), వాణిజ్య పన్నుల శాఖ నుంచి తాత్కాలిక జీఎస్టీ రిజిస్ట్రేషన్ పొందాలి. అలాగే అగ్నిమాపక, విద్యుత్, పోలీసు శాఖల నుంచి అవసరమైన అనుమతులు, ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి. ముందస్తు అనుమతులు లేకుండా లేదా నివాస ప్రాంతాల్లో బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణంలోని బాణసంచా వ్యాపారులు నిబంధనలు పాటించి ప్రజల భద్రతకు సహకరించాలని కోరారు.

నిర్మల్ సీడ్స్ ఆధ్వర్యంలో పత్తి పంటలో క్షేత్ర ప్రదర్శన

బెల్లంపల్లి, నవంబర్ 3, (జనంసాక్షి) బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి గ్రామంలో మంగళవారం నిర్మల్ సీడ్స్ ఆధ్వర్యంలో ఎన్సిహెచ్ 4341 పత్తి విత్తనాలపై క్షేత్రప్రదర్శన నిర్వహించారు. చంద్రవెల్లి చుట్టుపక్కల గ్రామ రైతులను సమావేశపరిచి నిర్మల్ సీడ్స్ విత్తనాలపై అవగాహన కల్పించారు. అధిక దిగుబడి సూచనగా ముందుండే నిర్మల్ సీడ్స్ బయో ఆర్గానిక్స్ కూడా రైతుల ఎంతో దిగుబడి చూపుతాయని తెలిపారు. ఈకార్యక్రమంలో నిర్మల్ సీడ్స్ నిర్వాహకులు ఆర్ఎం సందీప్, డిఆర్ఎం లక్ష్మణ్, టీఎస్‌శే సాయికృష్ణ, రైతులు పాల్గొన్నారు.

భద్రకాళీ దేవస్థానాన్ని సందర్శించిన ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు



వరంగల్ ఎంజిఎం, నవంబర్ 3 (జనంసాక్షి): వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానాన్ని ఈ రోజు ఉదయం ఆధ్యాత్మికవేత్త ప్రముఖ ప్రవచనకర్త డా॥ చాగంటి కోటేశ్వర రావు సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన కోటేశ్వర రావు కి ఆలయ చైర్మన్ డా॥ బి. శివసుబ్రహ్మణ్యం మరియు ధర్మకర్తలు గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, మయూరి రామేశ్వర్‌రావు, కమటం వేణుగోపాల్, మాడిశెట్టి సతీష్, కల్లూరి పవన్ కుమార్, చిదురాల అంజనీదేవి, పేరాల శ్రీనివాస రావు, రమేష్ చంద్ భంగ్, డా॥ వాసవీ రెడ్డి మరియు ప్రధానార్చకులు భద్రకాళి శేషులు పూర్ణకుంభంతో, వేదస్వస్తితో ఘనస్వాగతం పలికారు. ముందుగా గోకులంలో గోప్రదక్షిణ చేసి అనంతరం శ్రీ వల్లభ గణపతిని దర్శించిన తర్వాత అమ్మవారి ఆలయంలోకి ప్రవేశించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. పూజానంతరం ఆలయ మహామంపడపంలో అర్చకులు, వేదపండితులు మహదాశీర్వచనం నిర్వహించిన తదుపరి భక్తులను ఉద్దేశ్యించి తమ ప్రవచనం జరిపారు. ఈ సందర్భముగా చాగంటి కోటేశ్వరరావు ని వారి ప్రవచనం వినుటకు అనేక మంది భక్తులు ఆలయానికి చేరుకున్నారు.



బ్రీడింగ్ చెక్కర్స్ కార్మిక సంఘం

యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శులుగా రాజు, సరిత




చెన్నారావుపేట, నవంబర్ 3 (జనం సాక్షి): బ్రీడింగ్ చెక్కర్స్ కార్మిక సంఘం యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శులుగా ముత్యం రాజు, జన్ను సరితలను నియమించినట్లు బ్రీడింగ్ చెక్కర్స్ కార్మిక సంఘం యూనియన్ వరంగల్ జిల్లా అధ్యక్షులు భూక్య శ్రీనివాస్ నాయక్ తెలిపారు. మంగళవారం జిల్లా ప్రధాన కార్యదర్శులుగా రాజు, సరితలను నియమించినట్లు నియామక పత్రాలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా ఎన్నికకు సహకరించిన జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ నాయక్, బ్రీడింగ్ చెక్కర్స్ కార్మిక సంఘం యూనియన్ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బ్రీడింగ్ చెక్కర్స్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని రాజు, సరితలు తెలిపారు.

బిసి ఐక్య చైతన్య సమితి

రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఓదెల రవితేజ



ఆత్మకూర్, నవంబర్ 3 జనం సాక్షి) బీసీ ఐక్య చైతన్య సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఓదెల రవితేజను నియమించినట్లు రాష్ట్ర ప్రెసిడెంట్ ఆకారం మోహన్ ఒక ప్రకటన తెలిపారు. రాష్ట్రంలో ఉన్న బడుగు బలహీన వర్గాలను చైతన్య పరుస్తూ వారి హక్కుల సాధన కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే విధంగా ఉద్యమాల ద్వారా ఐక్యత తెస్తూ రాష్ట్రంలో బీసీల జెండా ఎగరవేసేందుకు రాష్ట్రంలో ఉన్న బీసీల అందరిని ఐక్యపరుస్తూ వారందరి కోసం పనిచేయాలని రాష్ట్రంలో ఉన్న మిగతా జిల్లాల కమిటీలు నియోజకవర్గ కమిటీలు మండల కమిటీలు పూర్తిచేసి బీసీల హక్కుల సాధన కోసం పనిచేయాలని తెలిపారు. అనంతరం ఓదెల రవితేజ మాట్లాడుతూ వర్కింగ్ ప్రెసిడెంట్ నియమించిన రాష్ట్ర అధ్యక్షులు ఆకారం మోహన్ కు కృతజ్ఞతలు తెలియజేశారు బీసీలకు హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం చేస్తామని తెలిపారు..

ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా మారాలి

అన్వేష్ నాయక్ పిలుపు



దేవరుప్పుల, నవంబర్ 3 (జనం సాక్షి): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అర్హులైన ప్రతి పట్టభద్రుడు తప్పనిసరిగా తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని దీజీవీ మండల అధ్యక్షుడు మూడ అన్వేష్ నాయక్ కోరారు. రోజువారీ పనుల్లో బిజీగా ఉన్నప్పటికీ కొంత సమయం కేటాయించి అవసరమైన ధ్రువపత్రాలతో ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులు, తోటి పట్టభద్రులకు కూడా అవగాహన కల్పించాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పించేలా నమోదు గడువు పొడిగించాలని సంబంధిత అధికారులను విజ్ఞప్తి చేశారు.

మృతుల కుటుంబాలకు

భూక్యా జాన్సన్ నాయక్ పరామర్శ



ఖానాపూర్ రూరల్ 3 నవంబర్ (జనం సాక్షి): మండలంలోని బిర్నంది గ్రామానికి చెందిన కారుకురి లచ్చన్న తల్లి గంగవ్వ, నర్ల లచ్చన్న ఇటీవల మృతి చెందగా, ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ భూక్యా జాన్సన్ నాయక్ వారి నివాసాలకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపి మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొమట్లగూడెం రైతు వేదికలో

ఘనంగా "ఖేత్ బచావో అభియాన్"



గంగారం, నవంబర్ 03 (జనం సాక్షి) గంగారం మండలం కొమట్లగూడెం గ్రామంలోని రైతు వేదికలో "ఖేత్ బచావో అభియాన్" అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. మండల వ్యవసాయ అధికారి వేణు యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు, మండల పరిషత్ అధికారి (ఎంపీఓ), వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు వ్యవసాయ రంగంలో ఎదురవుతున్న సమస్యలు, రైతుల సంక్షేమం, వ్యవసాయ భూముల పరిరక్షణ, స్థిరమైన వ్యవసాయ పద్ధతులపై వివరంగా అవగాహన కల్పించారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రతి రైతుకు చేరవేయాలని, వ్యవసాయ అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రైతుల సమస్యల పరిష్కారం, వ్యవసాయ అభివృద్ధి, రైతుల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతులు పెద్ద సంఖ్యలో హాజరై తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

గ్రామాల అభివృద్ధికి

నిధులు విడుదల చేయాలని వినతి

ఐటిడిఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ లెనిన్ వత్సల్ టోప్పోను కలసిన సర్పంచ్‌లు



గూడూరు,నవంబర్03(జనంసాక్షి): గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేసి సర్పంచ్ లను ఆదుకోవాలని మంగళవారం ఐటిడిఏ(పిఓ) కార్యాలయానికి వెళ్లిన గూడూరు మండలంలోని సీతానగరం గ్రామ సర్పంచ్ భూక్యా మంగీలాల్ నాయక్,రాములు తండా గ్రామ సర్పంచ్ బాదావత్ రమేష్ నాయక్,లైన్ తండా గ్రామ సర్పంచ్ బానోత్ మానస నరేష్ నాయక్ ఏటూరునాగారం ఐటిడిఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ లెనిన్ వత్సల్ టాప్పో ను మర్యాద పూర్వకంగా కలిసి తమ గ్రామాల్లో అవసరమైన సీసీ రోడ్ల నిర్మాణం,మరియు ఇతర అభివృద్ధి కార్యక్రమాల మంజూరు కోసం వినతి పత్రాలను సమర్పించారు.గ్రామాల మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమర్పించిన వినతులపై ప్రాజెక్ట్ ఆఫీసర్ సానుకూలంగా స్పందించి, అభ్యర్థనలను పరిశీలిస్తామని తెలియజేశారు.

బీజేపీ ఓబీసీ

మోర్చా మండల అధ్యక్షుడుగా "కృపాకర్"

పాలకుర్తి, నవంబరు 03(జనంసాక్షి) భారతీయ జనతాపార్టీ ఓబీసీ మోర్చా మండల.అధ్యక్షుడుగా బమ్మెర గ్రామానికి చెందిన దేవసాని కృపాకర్ ను ఆ సంఘం జనగామ జిల్లా అధ్యక్షుడు బొమ్మెరబోయిన సుధాకర్ మంగళవారం నియామక పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా కృపాకర్ మాట్లాడుతూ ఈ మండలంలో బీసీలను ఐక్యం చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. బీజేపీ పార్టీలో అత్యధిక శాతం మంది బీసీల చేర్పించి వారిని ఐక్యం చేస్తానన్నారు. తనపై ఎంతో నమ్మకంతో ఈ పదవి కట్టబెట్టిన ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సుధాకర్, మండల నాయకులు మారం రవికుమార్, జిల్లా నాయకుడు దొంగరి మహేందర్, కమ్మగాని శ్రీకాంత్, పబ్బ సంతోష్. పెనుగొండ సోమేశ్వర్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమానికి

ఎంపికైన ధర్మసాగర్ మండల సర్పంచ్‌లు



ధర్మసాగర్ నవంబర్ 3 (జనం సాక్షి) మండల అధికార ప్రతినిధి ప్రమోద్ పాల్ పొలుమారి హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం నుంచి హైదరాబాద్‌లో నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమానికి ఇద్దరు మహిళా సర్పంచ్‌లు ఎంపిక కావడం ఎంతో గర్వకారణం ఈ జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమానికి ఎంపికైన వారిలో ధర్మసాగర్ మండలానికి చెందిన శ్రీమతి శ్రీ మాచర్ల జ్యోతి ఏలీయా గారు అలాగే సాయి పేట్ గ్రామ సర్పంచ్ శ్రీమతి శ్రీ ఆడాలి నాగరాజు గారు ఉన్నారు ఈ ఎంపిక మహిళా నాయకత్వానికి గ్రామీణ అభివృద్ధికి లభించిన గౌరవంగా భావించవచ్చు ఈ శిక్షణ ద్వారా పరిపాలనా నైపుణ్యాలు గ్రామాభివృద్ధి ప్రణాళికలు ప్రజా సమస్యల పరిష్కారం ప్రభుత్వ పథకాల అమలు వంటి అంశాలపై మరింత అవగాహన పెంపొందించుకునే అవకాశం లభిస్తుంది మహిళా నాయకత్వం బలపడితే గ్రామాభివృద్ధి మరింత వేగవంతమవుతుంది శిక్షణతో నైపుణ్యం నైపుణ్యంతో సమర్థవంతమైన పాలన సమర్థవంతమైన పాలనతో అభివృద్ధి చెందిన గ్రామం పదవి ఒక బాధ్యత ప్రజాసేవ ఒక లక్ష్యంశ గ్రామాభివృద్ధి మన సంకల్పం ఈ సందర్భంగా శిక్షణ కార్యక్రమానికి ఎంపికైన ఇద్దరు మహిళా సర్పంచ్‌లకు రెండు గ్రామాల ప్రజలు ప్రజాప్రతినిధులు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు

పాపయ్యపేటలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం



చెన్నారావుపేట, నవంబర్ 3 (జనం సాక్షి): మండలంలోని పాపయ్యపేట గ్రామంలో జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖల ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరంను మంగళవారం నిర్వహించారు. ఈ శిబిరానికి గ్రామ సర్పంచ్ బుర్ర సుదర్శన్ ముఖ్యఅతిథిగా పాల్గొని గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని ప్రారంభించారు. చెన్నారావుపేట పశువైద్యులు జునైద్ ఖాన్ హాజరై రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ గోపాలమిత్ర సేవలను వినియోగించుకోవాలని లింగ నిర్ధారణ వీర్యం అందుబాటులో ఉందని దీని ద్వారా ఆడ దూడలు మాత్రమే పుడతాయని దీనిని రైతు సోదరులు వినియోగించుకోవాలని తెలిపారు. ఈ శిబిరానికి వచ్చిన పాడి పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎదకు రాని పాడి పశువులు 34, దూడలకు నట్టల నివారణ మందులు 23, గేదెలకు కృత్రిమ గర్భధారణ రెండింటికి గర్భకోశ వ్యాధులకు చికిత్సలు నిర్వహించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ లింగాల సారంగం, జల్లి పశువైద్యాధికారి వెంకటరాజు, గోపాలమిత్ర సూపర్వైజర్ మహమ్మద్ జహంగీర్, జీవివో శ్రావణ్, విఏ వీరులాల్, పంచాయతీ సెక్రటరీ రాజు, గోపాలమిత్రలు అబ్బరపూరి రమేష్, కళ్లెపు ప్రసాద్, బింగి లక్ష్మీనారాయణ, శ్రీకాంత్, పాడి రైతులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు కావాలి

కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు రేవూరి జలంధర్ రెడ్డి



ఆత్మకూర్, నవంబర్ 3 జనం సాక్షి) ఆత్మకూరు మండలంలోని ఆత్మకూరు, గూడెప్పాడు గ్రామలలో వరంగల్-- ఖమ్మం --నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశానుసారం మండల పార్టీ అధ్యక్షులు రేవూరి జలంధర్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు నిర్వహించారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల గొంతుకను శాసనమండలిలో బలంగా వినిపించేందుకు అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని రేవూరి పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా జలంధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత శక్తివంతమైన ఆయుధమని, ప్రతి పట్టభద్రుడు తన ఓటు హక్కును నమోదు చేసుకొని ప్రజాస్వామ్య బలోపేతంలో భాగస్వామి కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ కక్కెర్ల రాజు, బిఎల్ఏ లు పరికరాల వాసు, చిదిరాల శ్రీనివాస్ రెడ్డి, అల్వాల రవి, పట్టభద్రులు తదితరులు పాల్గొన్నారు.

మాదారం గ్రౌండ్ అందుబాటులోకి తెచ్చాం

సర్పంచ్ కృష్ణపల్లి లక్ష్మణ్



తాండూర్, నవంబర్ 03(జనం సాక్షి) మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం మాదారం గ్రామపంచాయతీ పరిధిలోని మాదారం గ్రౌండ్ (ఆటస్థలం) స్థానిక ప్రజలకు, యువతకు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చిందని గ్రామ సర్పంచ్ కృష్ణపల్లి లక్ష్మణ్ తెలిపారు .గ్రామస్థులు, మార్నింగ్ వాకర్స్ ఉదయం, సాయంత్రం వేళల్లో ఎలాంటి ఇబ్బందులు ఎదుకుండా, సౌకర్యవంతంగా వాకింగ్ మరియు జాగింగ్ చేసుకునేలా గ్రౌండ్‌ను సిద్ధం చేసినట్లు వారు పేర్కొన్నారు. ఎండనక, వాననక వ్యాయామం చేసుకునేందుకు వీలుగా ప్రజల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని వెల్లడించారు.గ్రామ ప్రజల ఆరోగ్యం, శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవడానికి ఈ ఆటస్థలం ఎంతో ఉపయోగపడుతుందని ప్రజాప్రతినిధులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి వార్డు సభ్యులు గొల్లపల్లి బానేష్, ఇతర వార్డు సభ్యులు, గ్రామ ప్రముఖులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

రేషన్ దుకాణంలో ఆకస్మిక తనిఖీ



ఖానాపూర్ రూరల్ 3 నవంబర్ (జనం సాక్షి): పట్టణంలోని పద్మావతి నగర్ కాలనీలో ఉన్న చౌక ధరల రేషన్ దుకాణాన్ని సివిల్ సప్లైస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ రవీందర్, 7వ వార్డు కౌన్సిలర్ నిమ్మల రమేష్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రేషన్ సరుకుల నిల్వలు, పంపిణీ విధానం, సంబంధిత రికార్డులను పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందిస్తున్న రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు. రేషన్ పంపిణీలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండేలా నిరంతర పర్యవేక్షణ చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీలర్లు రాజేశ్వర్, శ్రీనివాస్, సురేష్ ఉన్నారు.

మహా పాదయాత్రకు బీజేపీ శ్రేణుల తరలింపు



ఖానాపూర్ రూరల్ 3 నవంబర్ (జనం సాక్షి):నిర్మల్ జిల్లా కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజాస్వామ్య పరిరక్షణ మహా పాదయాత్రలో పాల్గొనేందుకు ఖానాపూర్ మండలానికి చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు జిల్లా కేంద్రానికి పలు వాహనాల్లో తరలి వెళ్లారు. ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ పార్టీ, ఇతర ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారాన్ని తిప్పికొట్టడంతో పాటు ప్రజాస్వామ్య పరిరక్షణ లక్ష్యంగా ఈ పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు బీజేపీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ సమితి అధ్యక్షుడు నగేష్ రెడ్డి ఐదవ వర్ధంతి వేడుకలు



కడెం:నవంబర్ 3(జనం సాక్షి) కడెం మండలంలోని నచ్చన్ ఎల్లాపూర్ గ్రామానికి చెందిన ప్రముఖ నాయకులు, మాజీ సమితి అధ్యక్షుడు కాట్పల్లి నగేష్ రెడ్డి ఐదవ వర్ధంతి వేడుకలను ఆయన కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలను చేపట్టి స్థానికంగా ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు.వర్ధంతి వేడుకల్లో భాగంగా కడెం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని కుటుంబ సభ్యులు సందర్శించారు. అక్కడ చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి, వారికి పండ్లను పంపిణీ చేశారు. అనంతరం వారి స్వగ్రామమైన నచ్చన్ ఎల్లాపూర్‌లో ప్రత్యేకంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కాట్పల్లి నగేష్ రెడ్డి కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు, పలువురు ప్రముఖులు మరియు అభిమానులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రజల కోసం నగేష్ రెడ్డి అందించిన సేవలను ఈ సందర్భంగా వక్తలు కొనియాడారు.

ఉపాధి హామీ మేట్లకు అవగాహన శిక్షణ కార్యక్రమం

సకాలంలో ఉపాధి, నిర్దేశిత వేతనం అందేలా మేట్లు కృషి చేయాలి: డీఆర్డీఓ విజయలక్ష్మి





దిలావర్పూర్, నవంబర్ 03, (జనం సాక్షి): వీబీ-జీ రామ్ జీ పథకం అమలులో మేట్లు కీలక పాత్ర పోషించాలని, కూలీలకు నిరంతర ఉపాధి కల్పించడంతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన వేతనం సకాలంలో అందేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విజయలక్ష్మి సూచించారు. మంగళవారం దిలావర్‌పూర్ మండలంలోని రైతు వేదికలో నిర్వహించిన మేట్ల శిక్షణ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. ఉపాధి హామీ పథకం ద్వారా అర్హులైన కూలీలకు పని కల్పించడం, హాజరు నమోదు, పని పురోగతిని పర్యవేక్షించడం, నిర్దేశిత పని కొలతల ప్రకారం మార్కింగ్ ఇవ్వడం వంటి అంశాల్లో మేట్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. కూలీలకు పథకంపై అవగాహన కల్పిస్తూ, వారి హక్కులు, బాధ్యతలను వివరించాలని సూచించారు. పనుల నిర్వహణలో పారదర్శకత పాటిస్తూ, ఎలాంటి అవకతవకలకు తావులేకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా ఏపీఓ దివ్యారెడ్డి పథకం అమలు విధానం, మేట్లు నిర్వహించాల్సిన విధులు, బాధ్యతలపై క్షుణ్ణంగా వివరించారు. టెక్నికల్ అసిస్టెంట్లు కె. వెంకటరమణ, బి. వెంకట్ రామ్‌లు పనుల స్వభావం, పని కొలతలు, కూలీలకు పని ప్రదేశంలో మార్కింగ్ ఇచ్చే విధానం, నిర్దేశిత పని పరిమాణాన్ని పూర్తి చేసే అంశాలపై ప్రాయోగిక శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో మేట్లతో పాటు మండలంలోని అన్ని గ్రామపంచాయితీల ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సన్నూరు ఆలయ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి- ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



రాయపర్తి,నవంబర్ 03 (జనంసాక్షి): సన్నూరు శ్రీ స్వయంభూ వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులను వేగవంతం చేసి,పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదతో కలిసి ఆలయ అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే, కలెక్టర్‌కు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం ఎస్‌డీఎఫ్ నిధుల కింద రూ.10 కోట్లతో చేపట్టిన పనుల వివరాలను అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు.కొన్ని నిర్మాణ పనులు పూర్తికాగా,కోనేరు, శివాలయం,అమ్మవారి ఆలయం,మండపాల సుందరీకరణ తదితర పనులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ మిగిలిన పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేయాలని,భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు.సన్నూరు శ్రీ స్వయంభూ వేంకటేశ్వర స్వామి ఆలయానికి చారిత్రక ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉందని ఆమె పేర్కొన్నారు.ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసి భక్తులకు అవసరమైన సౌకర్యాలను అందుబాటులో తీసుకురావడానికి కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ సునీత,జడ్పీ సీఈఓ వసంత,డీఆర్‌డీఓ నాగపద్మజ,ఆర్డీఓ సుమ,తహసీల్దార్ శ్రీనివాస్,గ్రామ సర్పంచ్,వివిధ శాఖల అధికారులు ,ప్రజాప్రతినిధులు, ఆలయ ధర్మకర్తలు, అభివృద్ధి కమిటీ సభ్యులు, అర్చకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి

చేతితో తయారుచేసే ఆభరణాల శిక్షణ ను ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్ అంకం మౌనిక మహేందర్



ఖానాపూర్ రూరల్ 3 నవంబర్ (జనం సాక్షి): మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహించేందుకు ఈడీఐఐ, యాక్సెంచర్ సంస్థల సహకారంతో నిర్వహిస్తున్న ఎంఎస్‌డీపీ-157 చేతితో తయారుచేసే ఆభరణాల శిక్షణ కార్యక్రమానికి మంగళవారం ఖానాపూర్‌లో మహిళలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ అంకం మౌనిక మహేందర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు తమలోని నైపుణ్యాలను వెలికితీసుకొని స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఇటువంటి శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని కుటుంబ ఆర్థిక అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఈడీఐఐ కార్యక్రమ అధికారి బుక్యా దేవేందర్ నాయక్ మాట్లాడుతూ ఎంపికైన మహిళలకు ఆభరణాల తయారీలో శిక్షణతో పాటు వ్యాపార నిర్వహణ, నమోదు, ఉత్పత్తుల గుర్తింపు, విక్రయాలు, మార్కెట్ అనుసంధానంపై మార్గదర్శకత్వం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ప్రకాశ్ గౌడ్, మెప్మా సీఓ శ్రవంతి, ఆర్పీలు రాజేందర్, మంగా, నారాయణ, లావణ్య, ఈడీఐఐ ప్రధాన శిక్షకురాలు అలేఖ్య పాల్గొన్నారు.

దోపిడీ పాలకవర్గాలపై

ప్రజా ఉద్యమాలే అమరులకు నిజమైన నివాళి

నంది రామయ్య పిలుపు




ఖానాపూర్ నవంబర్ 03 (జనం సాక్షి) భూమి కోసం, భుక్తి కోసం, దేశ విముక్తి కోసం తమ ప్రాణాలను అర్పించిన అమరుల ఆశయ సాధనకు బలమైన ప్రజా ఉద్యమాలను నిర్మించడమే నిజమైన నివాళి అని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ప్రజా పంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని ఆర్ అండ్ బి విశ్రాంతి భవన ప్రాంగణంలో పార్టీ ఆధ్వర్యంలో అమరవీరుల సంస్మరణ సభ, ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దోపిడీ పీడన లేని సమసమాజ స్థాపన కోసం అమరులు తమ ప్రాణాలను త్యాగం చేశారని కొనియాడారు. వారి త్యాగ నిరతిని స్ఫూర్తిగా తీసుకుని, ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణకు, సోషలిస్ట్ సమాజ నిర్మాణానికి నేటి యువత ముందుండాలని సూచించారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఫాసిజ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మండల పార్టీ నాయకులు జక్కుల రాజన్న, అడగట్ల శంకర్, చందు, మచ్చ శ్రీనివాస్, గోనే లచ్చన్న, రాజేశ్వర్ రావ్, చంబు, శంకర్, లక్ష్మణ్, జైతు, గోరె భాయ్, అభి తదితరులు పాల్గొన్నారు.

భూభారతి పెండింగ్ దరఖాస్తులు..రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి

ప్రతి మండలానికి రెండు సర్వే బృందాలను కేటాయించాలి
జీవో 59, 76 పెండింగ్ దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి
హైకోర్టు కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలి
భూ పరిపాలన ప్రధాన కమిషనర్, రెవెన్యూ శాఖ కార్యదర్శి డిఎస్ లోకేష్ కుమార్





ములుగు ప్రతినిధి, నవంబర్ 03(జనంసాక్షి). భూభారతి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంతోపాటు రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని భూ పరిపాలన ప్రధాన కమిషనర్, రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల రెవెన్యూ అదనపు కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో విజిలెన్స్ కేసులు, భూదాన్ నివేదిక, రీసర్వే, హైకోర్టు కేసులు, భూభారతి పాత, కొత్త పెండింగ్ దరఖాస్తులు, భూసేకరణ, భూముల క్రమబద్ధీకరణ అంశాలపై ఆయన సమీక్షించారు. ములుగు జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి సంబంధిత అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేష్ కుమార్ మాట్లాడుతూ, భూభారతి కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. పాత, కొత్త దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి, పెండింగ్ పనులను వేగవంతం చేయాలని సూచించారు. రీసర్వేను నిర్దేశిత ప్రణాళిక ప్రకారం పూర్తి చేసేందుకు ప్రతి మండలానికి రెండు సర్వే బృందాలను కేటాయించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో రీసర్వే ప్రక్రియ వేగంగా జరిగేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జీవో నంబర్లు 59, 76 కింద పెండింగ్‌లో ఉన్న క్రమబద్ధీకరణ దరఖాస్తులను నిర్ణీత గడువులోగా సమగ్రంగా పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. యూఎల్‌సీ భూములు, జీవో నంబర్ 118కు సంబంధించిన పెండింగ్ అంశాలపైనా సమీక్షించారు. హైకోర్టు పరిధిలో ఉన్న భూ సంబంధిత కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విజిలెన్స్ కేసులు, భూదాన్ నివేదిక, భూసేకరణకు సంబంధించిన పెండింగ్ అంశాల పురోగతిని సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణవేణి, ఏవో రాజ్‌కుమార్, పర్యవేక్షకులు మహేష్ బాబు, మంజుల, తహసీల్దార్ విజయభాస్కర్, డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో మీ ఓటు హక్కును నమోదు చేసుకోండి

అర్హులైన పట్టభద్రులందరికీ మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు ఇస్లావత్ సావిత్రి విజ్ఞప్తి



పర్వతగిరి నవంబర్ 03 జనం సాక్షిరానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పర్వతగిరి మండల పరిధిలోని అర్హులైన పట్టభద్రులందరూ తమ ఓటు హక్కును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు ఇస్లావత్ సావిత్రి విజ్ఞప్తి చేశారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, పట్టభద్రుల సమస్యలు, నిరుద్యోగ యువత ఆకాంక్షలు, విద్యావంతుల అభిప్రాయాలు ప్రజాస్వామ్య వేదికపై ప్రతిబింబించాలంటే ప్రతి అర్హులైన పట్టభద్రుడు ఓటరుగా నమోదు కావడం అవసరమని ఆమె పేర్కొన్నారు.కావున పర్వతగిరి మండలంలోని డిగ్రీ లేదా తత్సమాన విద్యార్హత కలిగిన అర్హులైన ప్రతి ఒక్కరూ ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలు, అర్హతలను పరిశీలించి, అవసరమైన ధ్రువపత్రాలతో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఒప్రతి ఓటు విలువైనదని, మన హక్కులను కాపాడుకోవడంతో పాటు మన గొంతును వినిపించుకోవడానికి ఓటరు నమోదు మొదటి అడుగు అని ఆమె తెలిపారు.

స్వచ్ఛ జమాల్ పురం దిశగా సర్పంచ్ అడుగులు

మూలనపడిన చెత్త వాహనానికి మరమ్మతులు



పర్వతగిరి నవంబర్ 03 (జనం సాక్షి) స్వచ్ఛ భారత్, స్వచ్ఛ తెలంగాణ, స్వచ్ఛ జమాల్ పురంలో భాగంగా, గత కొంతకాలంగా పర్యవేక్షణ లేక చెడిపోయి మూలన పడి ఉన్న గ్రామ పంచాయతీ చెత్త సేకరణ వాహనాన్ని (టీఎస్ 24 ఎ5714) తిరిగి బాగు చేయిస్తున్న సర్పంచ్ జున్ను కనుకయ్య యాదవ్. గ్రామంలో చెత్త సేకరణ సక్రమంగా జరగాలని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలనే ఉద్దేశంతో సొంత చొరవతో వాహనాన్ని రిపేర్ చేయించి తిరిగి వినియోగంలోకి తీసుకురావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎల్‌నినో ప్రభావం ప్రత్యామ్నాయ పంటల సాగుపై శిక్షణ

మండల వ్యవసాయ అధికారి జి, అనూష



మహాముత్తారం నవంబర్ 03 (జనం సాక్షి) ఎల్ నినో ప్రభావం ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు మండల వ్యవసాయ అధికారి అనూష శిక్షణ, కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం మండలంలోని బోర్లగూడెం రైతు వేదికలో వ్యవసాయ శాఖ–ఆత్మ ఆధ్వర్యంలో రైతులకు వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం,ఎల్‌నినో ప్రభావం ప్రత్యామ్నాయ పంటల సాగుపై శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి అనూష మాట్లాడుతూ దీనిని దృష్టిలో ఉంచుకుని రైతులు తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలైన పప్పు దినుసులు, కూరగాయలు, నూనె గింజలు తదితర పంటలను యాసంగి సాగు చేయాలని సూచించారు.నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంటల ఎంపికలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. 50 శాతం సబ్సిడీపై సూడోమోనాస్ అందుబాటులో ఉంది దీనిని రైతులు ఉపయోగించుకోవాలని తెలియజేశారు. రైతులకు పంటల పట్ల క్లుప్తంగా తెలియజేయుటకు వ్యవసాయ శాఖ అధికారులు అందుబాటులో ఉంటారని తెలియజేశారు. మీరు పండించే పంటల పట్ల ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చని తెలియజేశారు. రైతులు లాభదాయకమైన పంటలను మరియు నీరు తక్కువ తీసుకునే పంటలను పండించే ప్రయత్నం చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అజ్మీరా ధరమ్ సింగ్, మండల వ్యవసాయ అధికారి జి.అనూష, వ్యవసాయ విస్తరణ అధికారులు ఆర్ శివకృష్ణ ,ఆర్. శశివర్ధన్, ప్రవళిక, రైతులు తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ ద్వారా నానో ఎరువుల పిచికారీపై క్షేత్ర స్థాయి ప్రదర్శన



కాటారం నవంబర్ 3 (జనం సాక్షి): ఆత్మ ప్రోగ్రాం పథకంలో భాగంగా కాటారం మండలం చింతకాని గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా స్థానిక రైతు చీర్ల తిరుపతి రెడ్డి చెందిన వరి జైశ్రీరామ్ రకం సాగు చేస్తున్న పొలంలో డ్రోన్ సహాయంతో నానో యూరియా మరియు నానో డీఏపీ ఎరువులను పిచికారీ చేసే విధానంపై అధికారుల బృందం క్షేత్ర స్థాయి ప్రదర్శన నిర్వహించింది. తక్కువ ఖర్చుతో, అనువైన పద్ధతిలో డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించి ఎరువులు చల్లే విధానాన్ని, దాని వల్ల కలిగే లాభాలను వ్యవసాయ అధికారులు రైతులకు ప్రత్యక్షంగా వివరించారు. ఈ కార్యక్రమంలో మహాదేవపూర్ ఏడీఏ కాటారం మండల వ్యవసాయ అధికారిణి పూర్ణిమ, సర్పంచ్ శ్రీ దాబీట రాజేష్ , కాటారం మండల వ్యవసాయ విస్తరణ అధికారులు చుట్టుపక్కల రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన 5వ తెలంగాణ పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్--2026

విధి నిర్వహణలో ఎదురయ్యే ఒత్తిడిని అధిగమించేందుకు క్రీడలు దోహదం: ఐజీ గజారావు భూపాల్



హనుమకొండ జిల్లా ప్రతినిధి నవంబర్3 (జనం సాక్షి) :వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 5వ తెలంగాణ పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్--2026 (క్లస్టర్--డి) క్రీడా పోటీలను మంగళవారం ఉదయం హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఐజీ గజారావు భూపాల్, వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ ముఖ్య అతిథులుగా పాల్గొని ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఐజీ గజారావు భూపాల్ మాట్లాడుతూ, పోలీసు సిబ్బంది విధి నిర్వహణతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరచడం అభినందనీయమన్నారు. క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంతో పాటు మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ, జట్టుగా పనిచేసే సామర్థ్యాన్ని మెరుగుపరుస్తాయని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఎదురయ్యే పని ఒత్తిడిని అధిగమించేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. క్రీడాకారులందరూ క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని ఆకాంక్షించారు.అదేవిధంగా, ఈ క్రీడా పోటీలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసిన వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్‌ను, క్రీడల ఇన్‌చార్జి పోలీసు అధికారులను ఐజీ ప్రత్యేకంగా అభినందించారు.ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు మూడు రోజుల పాటు హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం, కిట్స్ కళాశాల, భీమారంలోని ఎస్‌వీఎస్ కళాశాల క్రీడా మైదానాల్లో వివిధ క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పోలీస్ యూనిట్లకు చెందిన సుమారు 1,458 మంది పోలీసు క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత, అడిషనల్ డీసీపీ (అడ్మిన్) రాయల ప్రభాకర్ రావు, అదనపు డీసీపీలు బాలస్వామి, ఏసీపీలు నర్సింహారావు, సదయ్య, మధుసూదన్, జానీ నర్సింహులు, ఏఆర్ అదనపు డీసీపీలు సురేష్, శ్రీనివాస్, నాగయ్య, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, క్రీడా నిర్వాహకులు, పోలీసు అధికారులు, సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

దాసారపు లింగయ్య అంతక్రియలలో పాల్గొన్న భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



టేకుమట్ల నవంబర్ 03 జనంసాక్షి టేకుమట్ల మండలంలోని గర్మిళ్లపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి దాసారపు సదానందం తండ్రి దాసారపు లింగయ్య మృతి చెందిన విషయం తెలుసుకున్న భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు లింగయ్య పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అంతిమయాత్రలో పాల్గొని ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులకు ఆయన తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు, కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తిప్పిరెడ్డి కృష్ణారెడ్డి కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఉప సర్పంచులు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఖానాపూర్ ఎంజేపీ బాలుర పాఠశాలను సందర్శించిన ప్యానెల్ బృందం



ఖానాపూర్ రూరల్ 3 నవంబర్ (జనం సాక్షి): పట్టణంలోని ఎంజేపీ బాలుర పాఠశాలను డాక్టర్ సృజన దేవి ఆధ్వర్యంలోని ప్యానెల్ బృందం మంగళవారం ఉదయం సందర్శించింది. ఈ సందర్భంగా పాఠశాలలో ప్రార్థనా సమావేశం నిర్వహణ, తరగతి గదుల్లో బోధనా విధానం, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. వసతి గదులు, భోజనశాల, వంటగది, ఆర్వో ప్లాంట్, నిల్వ గదితో పాటు పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. పాఠశాల నిర్వహణ, బోధనా విధానంపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, మరింత మెరుగైన నిర్వహణ, ఉత్తమ ఫలితాల సాధనకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సంతోష్ , ఉన్నారు.

అక్రమ ఇసుక రవాణాపై అధికారుల కొరడా

నాలుగు ట్రాక్టర్లు పట్టివేత



సిర్పూరు టి నవంబర్ 3సిర్పూరు టి. నవంబర్, 03,(జసం సాక్షి); మండలంలో అక్రమ ఇసుక రవాణాపై అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను అధికారులు పట్టుకున్నారు. తహసీల్దార్ మహమ్మద్ రహీముద్దీన్, ఎస్సై వెంకటేష్, ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని, సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. వాళ్ళని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ ఎదుట బైండోవర్ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణా చేస్తే కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇసుక రవాణా చేసే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా అనుమతులు పొందాలని, ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించవద్దని సూచించారు.

మేట్లకు విధులు, బాధ్యతలపై శిక్షణ

కూలీలకు సకాలంలో ఉపాధి, వేతనాలు అందేలా చూడాలి

మేట్లకు డీఆర్డీఓ విజయలక్ష్మి సూచన



దిలావర్‌పూర్:, నవంబర్ 03, జనంసాక్షి వీబీ–జీ రామ్ జీ పథకం అమలులో మేట్లు కీలక పాత్ర పోషించాలని డీఆర్డీఓ విజయలక్ష్మి సూచించారు. మంగళవారం దిలావర్‌పూర్ రైతు వేదికలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. కూలీలకు నిరంతర ఉపాధి కల్పించడంతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన వేతనాలు సకాలంలో అందేలా చూడాలన్నారు. హాజరు నమోదు, పనుల పర్యవేక్షణ, పని కొలతలు, పారదర్శకతపై మేట్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ దివ్యారెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు వెంకటరమణ, వెంకట్ రామ్, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు పాల్గొన్నారు.

పర్వతగిరి ఎస్సైను కలిసిన ఆదిజాంబవ సంఘ నాయకులు



పర్వతగిరి నవంబర్ 3 (జనం సాక్షి) ఆదిజాంబవ సంక్షేమ సంఘం పర్వతగిరి మండల్ ఆధ్వర్యంలో ఎస్సై పెగడ రాజ్ కుమార్ సన్మానంపర్వతగిరి నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఎస్సై పెగడ రాజ్ కుమార్ గారిని శాలువతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆదిజాంబవ సంక్షేమ సంఘం సభ్యులు చిన్నపాక శ్రీనివాస్. మాసాని యాకూబ్. వంగాల రవీందర్. జంగిలి బాబు. జన్ను దిలీప్. కందికట్ల స్మైలాబ్ బాబు. మాసాని సమ్మయ్య. మాసాని శ్రీనివాస్. తక్కలపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ రద్దు చేయాలి

సి.ఈ.సి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి



ఆసిఫాబాద్,నవంబర్ 3(జనం సాక్షి) భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డి వై ఎఫ్ ఐ) కుమురం భీం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డివైఎఫ్ఐ 47 వ ఆవిర్భావ దినోత్సవం జిల్లా కేంద్రంలోని (డీ వై ఎఫ్ ఐ) కార్యాలయంలో జెండా ఆవిష్కరణ జిల్లా అధ్యక్షులు గెడం టికానంద్ చేశారు. ఈ సందర్భంగా లిడివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దుర్గం రాజ్ కుమార్ మాట్లాడుతూలి దేశంలో 13 కోట్ల ఓట్లు నిర్వీర్యం చేస్తున కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో పుట్టిన ప్రతి పౌరునికి 18 సంవత్సరాలు నిండగానే ఓటు హక్కు కల్పించాల్సిన ఎన్నికల కమిషన్ నేడు కేంద్ర బిజెపి ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తూ పౌరుల ఓటు హక్కుని తీసివేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 73 లక్షల మంది పౌరుల ఓటు హక్కు ప్రమాదంలో ఉన్నాయి అన్నారు.ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను పూర్తిగా రద్దు చేసే దేశంలో అర్హత కలిగిన ప్రతి పౌరునికి ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టులో డివిజన్ బెంచ్ ఏర్పాటు చేసి సి.ఈ.సి జ్ఞానేష్ కుమార్ ని తొలగించి, ఎస్.ఐ.ఆర్ ప్రక్రియపై పూర్తిస్థాయిలో విచారణ జరిపాలని డిమాండ్ చేశారు.భారత రాజ్యాంగం ప్రకారం నడవాల్సిన ప్రధాన ఎన్నికల కమిషన్ బిజెపి ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తూ ఈరోజు రాజ్యాంగానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తూ ఓట్లను తొలగించడం సిగ్గుచేటు అన్నారు.లిజిల్లా అధ్యక్షులు గేడం టికానంద్‌లి మాట్లడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి నేటికీ భర్తీ చేయక నిరుద్యోగులతో చెలగాటం ఆడుతుందని అన్నారు కేంద్ర ప్రభుత్వ సంస్థలలో అనేక ఉద్యోగాలు ఖాళీలు ఉన్న భర్తీలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమవుతుంది అన్నారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి నాలుగు వేలు ఇస్తామని చెప్పి మోసం చేసిందని అన్నారు వెంటనే నిరుద్యోగ భృతి ఇవ్వాలని రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు రాజీవ్ యువ వికాసం కేవలం దరఖాస్తులకే పరిమితమయ్యాయని లబ్ధిదారులను దృష్టిలో పెట్టుకొని రాజీవ్ యువ వికాసం అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా జాబ్ క్యాలెండర్ కూడా విడుదల చెయ్యాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి దుర్గం నిఖిల్, డివైఎఫ్ఐ నాయకులు కార్తీక్, పవన్, శ్రీను ,రవికుమార్, లలిత, ప్రమీల, సంధ్య, సంగిత మరియు తదితరులు పాల్గొన్నారు.

కాషాయమయమైన నిర్మల్.. జనసంద్రమైన వీధులు!

వర్షాన్ని సైతం లెక్కచేయకుండా మహా పాదయాత్రలో వేలాదిగా తరలివచ్చిన ప్రజలు

కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శలు





నిర్మల్ బ్యూరో నవంబరు 3: జనం సాక్షి,,,,భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్మల్ పట్టణంలో మంగళవారం నిర్వహించిన మహా పాదయాత్రకు భారీ స్పందన లభించింది. బీజేపీ శ్రేణులు, ప్రజలు వేలాదిగా తరలిరావడంతో పట్టణ వీధులు కాషాయ జెండాలతో సందడిగా మారాయి. ఎస్ఐఆర్ (ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ)పై కాంగ్రెస్, ఇండీ కూటమి చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలనే నినాదంతో ఈ పాదయాత్ర నిర్వహించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. రూ.4 వేల పింఛను, యువతకు ఉద్యోగాలు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతులకు రైతు భరోసా వంటి హామీలను విస్మరించిందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన పదవిని కాపాడుకునేందుకు ఢిల్లీ చుట్టూ తిరుగుతున్నారని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రజల మద్దతుతో మూడోసారి అధికారంలోకి వచ్చారని, కోట్లాది మంది ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తున్న నాయకుడిపై విమర్శలు చేయడం తగదన్నారు. పాదయాత్రకు భారీగా తరలివచ్చి, వర్షాన్ని సైతం లెక్కచేయకుండా తమకు మద్దతుగా నిలిచిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రముఖుల హాజరు ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి సునీల్ బన్సల్, రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్, రాష్ట్ర సహ ఇన్‌చార్జిలు అభయ్ పాటిల్, రేఖాశర్మ, ఎంపీలు ఈటల రాజేందర్, గోడం నగేష్, ఎమ్మెల్సీలు మల్కా కొమరయ్య, అంజిరెడ్డి, ఎమ్మెల్యేలు రామారావు పటేల్, పాయల్ శంకర్, రాకేష్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, పాల్వాయి హరీశ్‌బాబు, బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్‌తో పాటు పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బియ్యం ధరల పట్టికలు తప్పనిసరి

- అధిక ధరకు విక్రయిస్తే చర్యలు
- పౌర సరఫరాల అధికారి



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి): జిల్లాలోని బియ్యం వ్యాపారులు, కిరాణా దుకాణాల యజమానులు తమ దుకాణాల్లో వినియోగదారులకు స్పష్టంగా కనిపించే విధంగా బియ్యం ధరల పట్టికలను తప్పనిసరిగా ప్రదర్శించాలని జిల్లా పౌర సరఫరాల అధికారి కిరణ్ ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీలోని పౌర సరఫరాల అధికారి కార్యాలయంలో బియ్యం వ్యాపారులు, కిరాణా సంఘం ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే బియ్యాన్ని విక్రయించాలని స్పష్టం చేశారు. నిర్ణీత ధరల కంటే అధికంగా వసూలు చేసినా, ధరల పట్టికలు ప్రదర్శించకపోయినా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట విక్రయ ధరల ప్రకారం బీపీటీ, కేఎన్ఎం రకం కిలో 66 రూపాయలు, ఆర్ఎన్ఆర్, తెలంగాణ సోనా కిలో 74 రూపాయలు, హెచ్ఎంటీ, జేఎస్ఆర్ కిలో 79 రూపాయలకు విక్రయించాలని సూచించారు. ప్రతి దుకాణంలోనూ ఈ ధరల పట్టికలను వెంటనే ఏర్పాటు చేసి నాణ్యమైన బియ్యాన్ని నిర్ణీత ధరలకే అందించాలని, వినియోగదారుల ప్రయోజనాల దృష్ట్యా వ్యాపారులందరూ నిబంధనలు పాటించాలని తెలిపారు. ఈ సమావేశంలో పౌర సరఫరాల సంస్థ డీఎం రాములు, తూనికలు కొలతల అధికారి శ్రీలత, మార్కెటింగ్ అధికారి, పౌర సరఫరాల శాఖ అధికారులు, కిరాణా సంఘం అధ్యక్షుడు, బియ్యం వ్యాపారుల ప్రతినిధులు పాల్గొన్నారు.

పత్తి పంటకు మద్దతు ధర కల్పించాల్సిన బాధ్యత అధికారులదే

పత్తి ధరలు తగ్గడంపై విచారణ జరిపించాలి

రైతు రక్షణ సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్ రావు



వరంగల్ ప్రతినిధి, నవంబర్ 3 (జనంసాక్షి): రైతులు పండించిన తెల్ల బంగారంగా పిలువబడే పత్తి పంటకు మద్దతు ధర కల్పించాల్సిన బాధ్యత మార్కెట్ అధికారులపై ఉందని తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్ రావు అన్నారు. మంగళవారం తెలంగాణ రైతు రక్షణ సమితి నాయకులు ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ ను సందర్శించి పత్తి రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీనివాస్ ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్ రావు మాట్లాడుతూ పత్తి ధరల విషయంలో ఇతర వ్యవసాయ మార్కెట్ లతో పోలిస్తే ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో తక్కువ ధరలు లభించడంపై రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని, ఇక్కడ తక్కువ ధరలు లభించడానికి గల కారణాలపై విచారణ జరిపించాలన్నారు. మార్కెట్లో పారదర్శకమైన బహిరంగ వేలం నిర్వహించి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. పత్తి కొనుగోళ్లలో వ్యాపారుల మధ్య కుమ్మక్కు లేదా ధరల నియంత్రణ జరుగుతుందా అని అంశాన్ని పరిశీలించాలన్నారు. రైతుల పత్తికి సరైన ధర నిర్ణయించేలా వ్యాపారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలన్నారు. పత్తి నాణ్యత, తేమశాతం పేరుతో రైతులకు అన్యాయం జరగకుండా నిబంధన ప్రకారం పరీక్షలు నిర్వహించాలన్నారు. ఇప్పటికే ఎల్ నినో ప్రభావంతో వర్షాలు సకాలంలో కురువక పత్తి దిగుబడులు గణనీయంగా తగ్గాయన్నారు. ఎకరాకు రావలసిన దిగుబడిలో భారీగా కోత పడటంతో రైతులు పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగిరాని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇలాంటి సమయంలో పత్తికి సరైన ధర రాకపోవడం రైతులను మరింత ఆర్థిక ఇబ్బందుల్లోకి నెడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆసియాలోనే అతిపెద్ద రెండవ మార్కెట్ అయిన ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ రైతుల చెమటకు తగిన ప్రతిఫలం అందించే కేంద్రంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో రైతు రక్షణ సమితి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్ జిల్లా ఉపాధ్యక్షుడు చౌళ్ల రామారావు జిల్లా కార్యదర్శి సురాబు బాబురావు నాయకులు నాగర్ల రాజీరు, భాషబోయిన కుమార్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు: జిల్లా కలెక్టర్ కె.హరిత



కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 03(జనంసాక్షి): జిల్లాలో నెలకొన్న భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. మంగళవారం జిల్లాలోని దహేగాం మండల కేంద్రంలో తహసిల్దార్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సుకు కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ హర్ష చౌదరి తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మండలంలో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అప్పటికప్పుడు పరిష్కారమయ్యే సమస్యలను అదే రోజు పరిష్కరించడం జరుగుతుంది అని తెలిపారు. సమస్యలు ఉన్న రైతులు దరఖాస్తులు సమర్పించాలని, అధికారులు పరిశీలించి క్షేత్రస్థాయిలో సమాచారంతో పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని తెలిపారు. ప్రజలు ప్రజాసేతు యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని, యాప్‌లో ఇంటి వద్ద నుండి క్యూ ఆర్ కోడ్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, ఎలాంటి వ్యయ ప్రయాసలకు గురి కావద్దని తెలిపారు. మండలంలోని హత్తిని గ్రామానికి చెందిన పెద్దల బాణక్క తన భూ సమస్య పరిష్కారానికి మీ సేవలో స్లాట్ బుక్ చేసుకోవడానికి డబ్బులు లేకపోవడంతో ఆందోళన చెందుతున్న విషయం తెలుసుకొని కలెక్టర్ వెంటనే 1 వేయి 500 రూపాయలు మహిళా రైతుకు అందజేయడంతో సదరు మహిళ రైతు ధన్యవాదాలు తెలుపుతూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ మునవర్ షరీఫ్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సింగరేణిలో గైర్హాజరుతో తొలగింపునకు గురైన వారికి పునరావకాశం

జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి): సింగరేణి సంస్థలో 2023 నుంచి 2025 మధ్య విధులకు గైర్హాజరు కారణంగా తొలగింపునకు గురైన మాజీ ఉద్యోగుల కేసుల పునఃపరిశీలనకు యాజమాన్యం నిర్ణయించింది. 01.01.2023 నుంచి 31.12.2025 మధ్య తొలగించబడిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని, 01.04.2026 నాటికి 46 ఏళ్లు లేదా అంతకంటే తక్కువ వయసు ఉండాలని పేర్కొంది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోల్ బెల్ట్ ప్రజా ప్రతినిధులతో సమావేశంలో డిస్మిస్డ్ ఉద్యోగులకు అవకాశం ఇవ్వాలని కోరడంతో యాజమాన్యం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. **అర్హతలు:** తొలగింపునకు ముందు గత 5 క్యాలెండర్ సంవత్సరాల్లో ఏవైనా రెండేళ్లలో కనీసం 100 మస్టర్లు పూర్తి చేసి ఉండాలి, జనరల్ అసిస్టెంట్ ట్రైనీ కేటగిరీ-1 పోస్టుకు వైద్యపరంగా ఫిట్ గా ఉండాలి. ఆసక్తి కలిగిన వారు నిర్దీత ప్రొఫార్మాలో దరఖాస్తును పూర్తి చేసి చివరిగా పనిచేసిన గని, డిపార్ట్ మెంట్ అధిపతికి సమర్పించాలి. చివరి తేదీ నవంబర్ 14. పూర్తి వివరాలకు సంబంధిత గనులు, శాఖల అధికారులను సంప్రదించాలని సీపీఆర్వో తెలిపారు.

బాధితులకు అండగా న్యాయ సేవాధికార సంస్థ

గవర్నమెంట్ ప్లీడర్ సుధాకర్



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి): అర్హులైన బాధితులకు న్యాయ సేవాధికార సంస్థ అండగా నిలుస్తుందని గవర్నమెంట్ ప్లీడర్ బోట్ల సుధాకర్ అన్నారు. నవంబర్ 9 జాతీయ న్యాయ సేవా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, పిల్లలు, వయోవృద్ధులు, ఎస్సీ, ఎస్టీలు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి సంస్థ ఉచిత న్యాయ సహాయం అందిస్తుందని తెలిపారు. కుటుంబాలు బాగున్నప్పుడే సమాజం బాగుంటుందని, తల్లిదండ్రులు పిల్లల పెంపకంలో జాగ్రత్త వహించాలని సూచించారు. లీగల్ సర్వీసెస్ డే సందర్భంగా వారోత్సవాలు ప్రారంభమయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి మల్లేశ్వరి, జిల్లా పరిరక్షణ అధికారులు రాజకొమురయ్య, వెంకటస్వామి, హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ తిరుపతి, సఖి సెంటర్ కోఆర్డినేటర్ గాయత్రి, న్యాయ సేవాధికార సంస్థ సూపరింటెండెంట్ రఘురాం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన 5వ తెలంగాణ పోలీస్ గేమ్స్



వరంగల్ ఎంజీఎం, నవంబర్ 3 (జనంసాక్షి): వరంగల్ కమిషనరేట్ వేదికగా 5వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ -- క్లస్టర్-డి విభాగానికి సంబంధించిన క్రీడా పోటీలు అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి . పోలీసు సిబ్బందిలో శారీరక దృఢత్వాన్ని, మానసిక ఉల్లాసాన్ని మరియు క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ప్రతి ఏటా నిర్వహించే ఈ క్రీడల ప్రారంభోత్సవానికి విశిష్ట అతిథిగా 4వ బెటాలియన్ కమాండెంట్ ఎన్.వి.ఎస్. శ్రీనివాస్ రావు విచ్చేశారు. కమాండెంట్ ఎన్.వి.ఎస్. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ..జోన్ 1 క్రీడాకారులకు జెర్సీలు, క్యాప్స్ అందించామని, విధి నిర్వహణలో నిరంతరం ఒత్తిడికి లోనయ్యే పోలీసులకు క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తితో రాణించాలని, గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ పోలీస్ శాఖ ప్రతిష్టను పెంచాలని పిలుపునిచ్చారు.పోటీల మొదటి రోజున తెలంగాణ ప్రత్యేక పోలీస్ జోన్-1 క్రీడాకారులు అద్భుత ప్రదర్శన కనబరిచారు. కబడ్డీ, హాకీ, వాలీబాల్, కోకో బాస్కెట్ బాల్ వివిధ క్రీడాంశాలలో జోన్-1 జట్లు తమ ప్రతిభను చాటుతూ విజయాలతో టోర్నమెంట్‌ను ఘనంగా ప్రారంభించాయి .ఈ కార్యక్రమంలో వరంగల్ కమిషనరేట్ పరిధిలోని ఉన్నతాధికారులు, బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ వంశీ మోహన్ రెడ్డి,అసిస్టెంట్ కమాండెంట్స్ వీరన్న, నాగభూషణం, ఆర్ఐ కార్తీక్ అధికారులు, కోచ్‌లు మరియు పెద్ద సంఖ్యలో పోలీస్ క్రీడాకారులు పాల్గొన్నారు.

దసారపు లింగయ్య మృతదేహానికి

నివాళులర్పించిన ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి రాష్ట్ర నాయకులు

అంబాల చంద్రమౌళి మాదిగ టేకుమట్ల మండల సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షులు కుర్రే మల్లయ్య యాదవ్



టేకుమట్ల, నవంబర్ 03 జనంసాక్షి జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం లోని గర్మిళ్లపల్లి గ్రామానికి చెందిన దసారపు రవి కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి దాసరపు సదానందం తండ్రి దసారపు లింగయ్య మంగళవారం ఉదయం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వివిధ రాజకీయ, సామాజిక సంఘాల నాయకులు గర్మిళ్లపల్లిలోని ఆయన నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం దసారపు లింగయ్య పార్థివదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ కష్ట సమయంలో వారికి మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు పొన్నం సాంబయ్య నాంపెల్లి వీరేశం బొడ్డు తిరుపతి కత్తి సంపత్ తోట గట్టయ్య జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ దొంతుల శ్రీనివాస్ సీపీఐ (ఎంఎల్) జయశంకర్ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి మారేపల్లి మల్లేష్, ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు రామ్ రామచందర్ మాదిగ, జిల్లా నాయకులు నోముల శ్రీనివాస్ మాదిగ, గాజుల బిక్షపతి మాదిగ, ఎమ్మార్పీఎస్ టేకుమట్ల మండల అధ్యక్షులు మచ్చ శ్రీకాంత్ మాదిగ, ఎం ఎస్ పి మండల అధ్యక్షులు మాడుగుల వీరయ్య మాదిగ, అక్కల భద్రయ్య, ఇల్లందుల శంకర్, రేణిగుంట్ల శంకర్, ఈసంపెల్లి పోశాలు, పాల శంకర్ మాదిగ,ఈసంపెల్లి రాజయ్య మాదిగ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు .

ఉద్యమకారుడు లక్ష్మణ్ గౌడ్ మృతి ప్రభుత్వ హత్యే

నల్లబెల్లి, నవంబర్ 03 (జనంసాక్షి): తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, బచ్చన్నపేట పీఏసీఎస్ డైరెక్టర్ లక్ష్మణ్ గౌడ్ ఆత్మహత్య ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల సాంబరావు ఆరోపించారు. ఉద్యమంలో పాల్గొనడమే తాను చేసిన తప్పంటూ లేఖ రాసి ఆయన ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయకపోవడం వల్లే ఇలాంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమకారులకు నెలకు రూ.25 వేల పెన్షన్, గుర్తింపు కార్డులు, 250 గజాల ఇంటి స్థలం, ఇందిరమ్మ ఇల్లు, ఆరోగ్య భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కేశవరావు కమిటీ పేరుతో కాలయాపన చేయకుండా ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే అమలు చేయాలని కోరారు. ఉద్యమకారులు ఆత్మహత్యలకు పాల్పడకుండా హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

అగర్వాడ గ్రామపంచాయతీలో మెరుగైన విద్యుత్ సదుపాయం



కెరమెరి, నవంబర్ 3 (జనంసాక్షి) గ్రామీణ ప్రాంతాలలో విద్యుత్ సదుపాయాన్ని మెరుగుపరచడంలో భాగంగా మంగళవారం మండలంలోని అగర్వాడ గ్రామ పంచాయతీ నింగూడ పరిధిలో 3-ఫేజ్ విద్యుత్ లైన్ అనుసంధానంతో పాటు భద్రతా ప్రమాణాలతో కూడిన కొత్త కరెంట్ మీటర్ బోర్డును అమర్చడం జరిగింది. స్థానిక ప్రజల సౌకర్యార్థం విద్యుత్ అవసరాలను తీర్చడానికి ఈ ఏర్పాటు ఎంతగానో ఉపయోగపడుతుందని గ్రామ సర్పంచ్ వాడుగురే రోజా సోనాజి అన్నారు. గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధే తమ లక్ష్యమని, విద్యుత్ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నెల్లుట్ల గ్రామంలో
దూడలకు నట్టల నివారణ కార్యక్రమం నిర్వహణ



లింగాల ఘణపురం, నవంబర్03(జనంసాక్షి): నెల్లుట్ల గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో దూడలకు నట్టల నివారణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా దూడలకు నట్టల నివారణ మందు త్రాగించడం జరిగింది.ఈ సందర్భంగా నట్టల నివారణ కార్యక్రమం వల్ల దూడల్లో ఆరోగ్యకరమైన ఎదుగుదల, బరువు పెరుగుదలతో పాటు నట్టల వల్ల కలిగే అనారోగ్య సమస్యలను నివారించవచ్చని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నెల్లుట్ల గ్రామ సర్పంచ్ నర్సింగ రామక్రిష్ణ , ఉపసర్పంచ్ దామర కావ్య, మండల పశు వైద్యాధికారి డా. జితేందర్ , పశువైద్య సిబ్బంది శైలజ వి ఎల్ వో మరియు పాడి రైతులు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాలి
పోతినేని సుదర్శన్ రావు
నల్లగొండలో నవంబర్ 15 నుంచి అఖిలభారత 36వ మహాసభ



గోవిందరావుపేట, నవంబర్ 03 (జనం సాక్షి) :- రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ రావు పిలుపునిచ్చారు. నవంబర్ 15 నుంచి 18 వరకు నల్లగొండలో జరిగే 36వ అఖిలభారత మహాసభల సందర్భంగా గోవిందరావుపేట పీఎస్ఆర్ గార్డెన్ లో ములుగు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1991 తర్వాత నూతన ఆర్థిక విధానాలతో విత్తన రంగం కార్పొరేట్ చేతుల్లోకి వెళ్లిందని, విదేశీ దిగుమతులతో వ్యవసాయం సంక్షోభంలో పడిందని అన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో రైతుకు రూ.22 లక్షల సబ్సిడీ ఇస్తే ఇక్కడ రూ.2 వేలు కూడా ఇవ్వడం లేదని విమర్శించారు. మహాసభలో మద్దతు ధరకు చట్టం, రుణమాఫీ, రైతులకు రూ.10 వేల పింఛన్‌పై చర్చిస్తామని చెప్పారు.

ఫోటోగ్రాఫర్ కుటుంబానికి రూ.1.60 లక్షల భరోసా
ములుగు డీఎస్పీ చేతుల మీదుగా చెక్కు అందజేత



ములుగు, నవంబర్ 03 (జనం సాక్షి) :- తెలంగాణ ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ "కుటుంబ భరోసా" పథకం ద్వారా మృతి చెందిన ఫోటోగ్రాఫర్ కుటుంబానికి రూ.1.60 లక్షల సాయం అందించింది. వెంకటాపూర్‌కు చెందిన శబరి స్టూడియో అధినేత మోడెం వెంకటేశ్వర్లు మృతితో ఆ కుటుంబం ఇబ్బందుల్లో పడింది. రాష్ట్ర అధ్యక్షులు హుస్సేన్ ఆదేశాలతో, వరంగల్ జిల్లా అధ్యక్షులు గాద లింగమూర్తి ఆధ్వర్యంలో సేకరించిన నిధులను ములుగు డీఎస్పీ నలువాల రవీందర్ చేతుల మీదుగా 194వ సాయంగా అందజేశారు. కుటుంబాలకు అండగా నిలవడం ఆదర్శమని డీఎస్పీ అన్నారు. కార్యక్రమంలో దేశిని మహేందర్ గౌడ్, పిల్లలమర్రి రాము, కందుల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీవో చలాన్ పేరిట సైబర్ మోసాలు
రాజీవ్‌నగర్ గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ మామిడాల లలిత రాజేశం పిలుపు



తాండూర్, నవంబర్ 03(జనం సాక్షి) మంచిర్యాల జిల్లా :తాండూర్ మండలం రాజీవ్‌నగర్ ప్రస్తుతం సమాజంలో సైబర్ నేరాలు రోజురోజుకూ పెరిగిపోతున్న నేపథ్యంలో, వాహనదారులను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న ఆర్టీవో చలాన్ సైబర్ మోసాల పట్ల గ్రామ ప్రజలందరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని రాజీవ్‌నగర్ గ్రామ సర్పంచ్ మామిడాల లలిత -- రాజేశం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

ఇటీవల కాలంలో సైబర్ నేరగాళ్లు సరికొత్త పంథాలో మోసాలకు పాల్పడుతున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. వాహనదారుల మొబైల్ ఫోన్లకు "మీ వాహనంపై ఆర్టీవో చలాన్ పెండింగ్‌లో ఉంది" అంటూ నకిలీ మెసేజ్‌లు పంపుతున్నారని, ఆ మెసేజ్‌లతో పాటు కొన్ని మోసపూరిత లింకులను జత చేస్తున్నారని తెలిపారు. ప్రజలు నిజమైన చలాన్ అనుకుని ఆ లింకులను క్లిక్ చేస్తే, వారి బ్యాంక్ ఖాతా ఖాళీ అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

సర్పంచ్ సూచించిన ముఖ్యమైన జాగ్రత్తలు:

లింకులను క్లిక్ చేయవద్దు: మొబైల్‌కు వచ్చే ఎలాంటి గుర్తుతెలియని, అనుమానాస్పద ఆర్టీవో చలాన్ లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయకూడదు. వ్యక్తిగత వివరాలు గోప్యంగా ఉంచండి: మీ బ్యాంక్ ఖాతా వివరాలు, డెబిట్/క్రెడిట్ కార్డ్ నంబర్లు, ఓటీపీ (వన్ టైమ్ పాస్‌వర్డ్) లేదా ఇతర వ్యక్తిగత సమాచారాన్ని ఫోన్లలో గానీ, మెసేజ్‌లలో గానీ ఎవరికీ తెలియజేయవద్దు. అధికారిక వెబ్‌సైట్లను మాత్రమే పరిశీలించండి: చలాన్లు ఏవైనా ఉంటే ప్రభుత్వ అధికారిక ఆర్టీవో లేదా ట్రాఫిక్ పోలీస్ వెబ్‌సైట్లలో మాత్రమే తనిఖీ చేసుకోవాలి. సాంకేతికతను ఆసరాగా చేసుకుని అమాయకులను ముంచేస్తున్న ఇలాంటి సైబర్ నేరగాళ్ల పట్ల గ్రామ ప్రజలంతా నిరంతరం అవగాహనతో, జాగ్రత్తగా ఉండాలని సర్పంచ్ మామిడాల లలిత రాజేశం కోరారు. ఒకవేళ ఎవరైనా ఇలాంటి మోసాల బారిన పడితే వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

సీసీ కెమెరాలతో నేరాలకు చెక్!
గ్రామాల భద్రతకు సాంకేతికత ఎంతో దోహదం
సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ, నిందితుల గుర్తింపు సులభం
ప్రతి గ్రామంలో నిఘా వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలి
లింగోజీతండా ఎక్స్‌రోడ్డులో కెమెరాలను ప్రారంభించిన ఎస్పీ అఖిల్ మహాజన్



ఉట్నూర్ నవంబర్ 4(జనం సాక్షి): నవంబర్ 03(జనం సాక్షి)గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. నేరాల నియంత్రణతోపాటు నేరాలకు పాల్పడిన వారిని గుర్తించడంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఉట్నూర్ మండలంలోని లింగోజీతండా ఎక్స్‌రోడ్డులో గ్రామ సర్పంచ్ మాయ హరినాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సీసీ కెమెరాల ఏర్పాటుతో గ్రామాల్లో జరిగే అనుమానాస్పద కార్యకలాపాలను ఎప్పటికప్పుడు గుర్తించవచ్చన్నారు. దొంగతనాలు, ఇతర నేరాలు జరిగినప్పుడు నిందితులను గుర్తించేందుకు కెమెరాల్లో నమోదైన దృశ్యాలు కీలక ఆధారాలుగా ఉపయోగపడతాయని తెలిపారు. ప్రధాన కూడళ్లు, రహదారులు, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా ప్రజలకు మరింత భద్రత కల్పించవచ్చని చెప్పారు. గ్రామాల అభివృద్ధితోపాటు ప్రజల భద్రతకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని, సీసీ కెమెరాల నిర్వహణలో గ్రామపంచాయతీ ప్రతినిధులు, ప్రజలు భాగస్వాములు కావాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం ద్వారా నేరాలను అరికట్టేందుకు, ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. సర్పంచ్ మాయ హరినాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో, ఏ ఎస్పీ రిత్విక్ సాయి కొట్టే, సి ఐ మడవి ప్రసాద్, గ్రామ పెద్ద నాందేవ్ నాయక్, ఎస్టీ సెల్ జిపి అధ్యక్షులు జాదవ్ సాయికిరణ్, గ్రామ యువకులు గ్రామపంచాయతీ ప్రజా ప్రతినిధులు, అంగన్వాడీలు గ్రామస్థులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరకు బియ్యం అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు
జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల ప్రతినిధి, నవంబర్ 3, జనం సాక్షి అధిక ధరలకు బియ్యం విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని మంచిర్యాల పట్టణం మెయిన్ రోడ్డులో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు లోబడి బియ్యం విక్రయాలు జరిపేందుకు వీలుగా శ్రీనాథ్ ట్రేడర్స్ వారు నూతనంగా ఏర్పాటు చేసిన బియ్యం అమ్మకాల అవుట్ లెట్ ను ఇన్చార్జి జిల్లా పౌర సరఫరాల అధికారి, సంబంధిత అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ట ధరలకు మించి అమ్మకాలు జరుపకూడదని, నిబంధనలను ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. బి.పి.టి, హెచ్.ఎం.టి. తదితర రకాల బియ్యంను ప్రభుత్వ నిర్దేశిత ధరలకు అందించేందుకు గజానన్ ఇండస్ట్రీస్ ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. ఎల్ నినో ప్రభావం వల్ల ప్రస్తుతం మార్కెట్ లో నెలకొని ఉన్న పరిస్థితుల నేపథ్యంలో బియ్యం వ్యాపారులు, ట్రేడర్లు అందరూ మానవతా దృక్పథంతో వ్యవహరిస్తూ ప్రజలకు బియ్యం ధరలను అందుబాటులో ఉంచాలని, ప్రభుత్వ నిర్ణీత ధరకే విక్రయాలు జరిగేలా రెవెన్యూ, పౌర సరఫరాల శాఖల అధికారులతో ఆకస్మిక తనిఖీల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని, తనిఖీల కోసం వచ్చే బృందాలకు వ్యాపారులు, ట్రేడర్లు సహకరించాలని తెలిపారు. 26 కిలోల బరువుతో కూడిన ప్రీమియం క్వాలిటీ బి.పి.టి. రా రైస్ బ్యాగ్ ను 1430 రూపాయలు, హెచ్.ఎం.టి స్టీమ్ రకం బియ్యం బస్తా 1898 రూపాయల చొప్పున అవుట్ లెట్ ద్వారా నిబంధనల ప్రకారం విక్రయాలు జరుపుతామని నిర్వాహకులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి
ద్విచక్ర వాహనంపై ఇసుక లారీ దూసుకు వెళ్లడంతో ఘటన





మహాదేవపూర్ : నవంబర్ 3 (జనంసాక్షి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కన్నేపల్లి గ్రామం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న స్వామి పై లారీ దూసుకు వెళ్లడంతో తల భాగంనుజ్జు నుజ్జుగా మారి స్వామి సంఘటన స్థలం వద్ద మృతి చెందిన ఘటన మంగళవారం రోజు చోటుచేసుకుంది. మృతి చెందిన వ్యక్తి ముఖం తీవ్రంగా ప్రమాదానికి గురి కావడంతో గుర్తు పట్టకుండా మారడంతో కొద్దిసేపు మృతుడు ఎవరు అనేది గుర్తించ లేకుండా పోయింది. చివరికి ద్విచక్ర వాహనం నెంబర్ ప్లేట్ ద్వారా విచారించగా మహాదేవపూర్ గ్రామానికి చెందిన పోత పెద్దళ్ళ స్వామి గా గుర్తించడం జరిగింది.

ద్విచక్ర వాహనంపై ఇసుక లారీ దూసుకు వెళ్లడంతో ఘటన. మంగళవారం రోజు ఉదయం పోత పెద్దోళ్ళ స్వామి కౌలు రైతు రోజువారి దిన చర్యలో భాగంగా వేములపల్లి గ్రామంలో తన పత్తి చేను కు వెళ్తున్న క్రమంలో బీరసాగర్ గ్రామం దాటి వెళ్లే క్రమంలో ఇసుక లోడ్ నింపుకొని వస్తున్న ఇసుక లారీ సీసీ రోడ్డు ఎక్కి క్రమంలో, బీరసాగర్ గ్రామం నుండి వస్తున్న స్వామి ద్విచక్ర వాహనాన్ని లారీ ముందు భాగం ఢీ కొని, లారీ ముందు టైర్లతో పాటు వెనుక టైర్ల వరకు స్వామి తో పాటు ద్విచక్ర వాహనం పై ఎక్కడంతో, పెద్దోళ్ళ స్వామి తల భాగం పూర్తిగా చిత్తు అయి మెదడు అంతా బయటపడడంతో స్వామి అక్కడే మృతి చెందడం జరిగింది. కౌలు రైతు తన పత్తి చేను పనుల నిమిత్తం వెళుతూ రోడ్డు ప్రమాదానికి గురై పరలోకానికి వెళ్లడం, యావత్ మండల కేంద్ర ప్రజలకు దిగ్భ్రాంతిని కలిగించేలా చేసింది.మహాదేవపూర్ మండల కేంద్రంలోని పోతవాడకు చెందిన పోత పోచన్న రెండవ కుమారుడు పోత పెద్దోళ్ళ స్వామి, వీరు వ్యవసాయ కుటుంబానికి చెందినవారు, పోత స్వామి, అత్తగారి గ్రామమైన మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం వేములపల్లి గ్రామంలో మూడు ఎకరాల పత్తి మొక్కలు నాటి వ్యవసాయం చేయడం జరుగుతుంది. పత్తి మొక్కలకు సంబంధించి నీరు అందించే కార్యక్రమంతో పాటు పత్తి మొక్కలకు క్రిమిసామారకమందు ఇతర చేను పనుల నిమిత్తం దినం తప్పి దినం వేముల పల్లిలోని తన చేను పనులు చేసుకుని రావడం జరుగుతుంది. అదే క్రమంలో మంగళవారం రోజు కూడా దినచర్యలో భాగంగా పోత పెద్దోళ్ళ స్వామి వేములపల్లి వద్ద ఉన్న చేనుకు వెళ్లే క్రమంలో స్వామి తిరిగిరాని లోకానికి వెళ్లడం, ఆ కుటుంబానికి పెద్ద దిక్కు లేకుండా చేసింది విధి, మృతుడు పోత పెద్దోళ్ళ స్వామికి, భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం మహాదేవపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగింది.

కుంభం రాజయ్య కుటుంబానికి రూ.10 వేల సాయం
ముదిరాజ్ సేవా సమితి అండ



స్టేషన్ ఘన్ పూర్, నవంబర్ 03 (జనం సాక్షి) :- పట్టణానికి చెందిన కుంభం రాజయ్య ముదిరాజ్ ఇటీవల రెండు కిడ్నీలు పాడై మృతి చెందడంతో ఆ కుటుంబం పెద్దదిక్కును కోల్పోయి ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుంది. విషయం తెలుసుకున్న కౌన్సిలర్ పెసరు కృష్ణవేణి సారయ్య, పీఆర్ ముదిరాజ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పెసరు రాజన్నకు తెలియజేశారు. దాతల సహకారంతో బాధిత కుటుంబానికి అండగా నిలిచేందుకు రాష్ట్ర నాయకులు సింగారపు రామకృష్ణ, కౌన్సిలర్ కృష్ణవేణి సారయ్య మంగళవారం మృతుని ఇంటికి వెళ్లి చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబాన్ని పరామర్శించి కుల పెద్దల సమక్షంలో రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. రాజకీయాలు వేరైనా ఆపదలో కుల బంధువులంతా ఒక్కటై అండగా నిలవడం అభినందనీయమని, ఇది ముదిరాజుల ఐక్యతకు నిదర్శనమని రామకృష్ణ అన్నారు. కార్యక్రమంలో అమ్మగారి శ్యామ్, పొన్నం స్వరూప, దండు చిరంజీవి, కుంభం గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులు పీఎం రాహత్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి- ఎస్పీ సంకీర్త్



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి): రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు సత్వర వైద్యం అందించి విలువైన ప్రాణాలు కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం రాహత్, రహ్ వీర్ పథకాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ సూచించారు. పీఎం రాహత్ పథకం కింద ప్రమాద బాధితులకు గరిష్టంగా లక్షా 50 వేల వరకు ఏడు రోజుల పాటు నగదు రహిత వైద్య చికిత్స అందిస్తారని, జిల్లాలో కిరణ్ ఆసుపత్రి, యోధా ఆసుపత్రి, 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి, మహాదేవపూర్, చిట్యాల ప్రభుత్వ ఆసుపత్రులు కలిపి ఐదు గుర్తింపు పొందిన ఆసుపత్రుల్లో ఈ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రమాదం జరిగిన మొదటి గంటలోనే బాధితులను ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడిన వారికి రహ్ వీర్ పథకం కింద ఒక్కో ఘటనకు 25 వేల నగదు ప్రోత్సాహకం, ఏటా అత్యుత్తమ సేవలు అందించిన పది మందికి లక్ష చొప్పున జాతీయ అవార్డులు అందజేస్తారని వివరించారు. ప్రమాదం జరిగిన వెంటనే 112కు ఫోన్ చేసి క్షతగాత్రులను సమీప గుర్తింపు ఆసుపత్రికి తరలించేందుకు సహకరించాలని, మానవతా దృక్పథంతో స్పందించి ప్రాణాలు కాపాడాలని కోరారు.

ఖేలో ఇండియా క్రీడలకు పక్కాగా ఏర్పాట్లు
డిసెంబర్ 18 నుంచి 21 వరకు జేఎన్ఎస్ స్టేడియంలో జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలు
1,500 మంది క్రీడాకారులు, సాంకేతిక బృందాల రాక ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో సమీక్ష



హనుమకొండ జిల్లా ప్రతినిధి నవంబర్ 3 (జనం సాక్షి) :దేశవ్యాప్తంగా క్రీడాకారులు పాల్గొనే ఖేలో ఇండియా యూత్ గేమ్స్ అథ్లెటిక్స్ పోటీల నిర్వహణకు హనుమకొండలో విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. డిసెంబర్ 18 నుంచి 21వ తేదీ వరకు హనుమకొండ జేఎన్ఎస్ స్టేడియంలో 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్--2026 అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్న నేపథ్యంలో మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫెరెన్స్ హాల్ లో వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించారు.ఈ పోటీలకు క్రీడాకారులు, అధికారులు, సాంకేతిక బృందాలు, కోచ్‌లు కలిపి సుమారు 1,500 మంది హాజరయ్యే అవకాశం ఉందని..జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కొత్త ప్రశాంత్ తెలిపారు. ఈ నేపథ్యంలో క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతి, భోజనం, రవాణా, వైద్య సేవలు, భద్రత, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయముగా పని చేయాలన్నారు ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్. రవి, జీడబ్ల్యూఎంసీ అధికారులు, డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య, ఏసీపీలు పి. నర్సింహారావు, టి. సత్యనారాయణ, ఆర్‌అండ్‌బీ ఈఈ దేవక చవాన్, జిల్లా యువజన క్రీడల అధికారి కొత్త ప్రశాంత్, తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సారంగపాణి ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మిర్చి పంటను ధ్వంసం చేసిన దుండగులు



వరంగల్ ప్రతి నవంబర్ 3(జనం సాక్షి): ఆరుకాలం కష్టపడి ఎర్ర బంగారం పండిద్దామని ఒక ఎకరం 15 గుంటల్లో మిరప తోట సాగు చేయగా రాత్రికి రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు మిరప పంటను ధ్వంసం చేసి అన్నదాతకు నాలుగు లక్షలకు పైగా విలువగల పంటను ధ్వంసం చేసిన సంఘటన వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం వెంకటాపురం గ్రామంలో జరిగింది. స్థానిక ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం దుగ్గొండి మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన ఇంగ మనోహర్ రావు తన కుడబడిన వ్యవసాయ భూమిలో మిరప తోట సాగు చేశాడు. మిరప తోటకు అప్పులు తీసుకొచ్చి పెట్టుబడి పెట్టి ఏపుగా మిరప తోట కాయడంతో ఈ ఏడాది అప్పులు తీరుతాయని నమ్మకంతో ఉండగా రాత్రికి రాత్రే గుర్తు తెలియని దుండగులు మిరప తోటను ధ్వంసం చేసిన సంఘటన చూసిన రైతు మనోహర్ తీవ్ర ఆందోళనకు గురయ్యాడు. మిరప తోటను చూసి ఏపుగా పెరిగిన పంటను ధ్వంసం చేయడం తమ ఆశలన్నీ నిరాశలయ్యాయని ఆవేదన చెందారు. దుండగులు చేసిన పనిని స్థానిక పోలీసులకు తెలియజేయడంతో పంట ధ్వంసానికి కారకులైన వారిని గుర్తించి చట్టపకారం చర్యలు తీసుకోవాలని మనోకోరారు.. నాలుగు లక్షల రూపాయల పెట్టుబడి పెట్టడంతో తమ కుటుంబం వీధిన పడిందని ఆయన అన్నారు. స్థానిక ఎస్సై మహేందర్ పంట ధ్వంసం చేసిన కారకులపై చర్యలు తీసుకుంటామని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేందర్ వివరించారు..

ప్లాస్టిక్ నిషేధానికి చేయూత
గ్రామపంచాయతీకి 500 స్టీల్ ప్లేట్లు అందజేత



నల్లబెల్లి, నవంబర్ 03 (జనంసాక్షి): ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిస్థాయిలో తగ్గించి, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని నల్లబెల్లి మండల కేంద్రానికి చెందిన పెద్ది కుటుంబ సభ్యులు ముందడుగు వేశారు. దివంగత పెద్ది విమల జ్ఞాపకార్థం ఆమె కుమారులు పెద్ది మహిపాల్ రెడ్డి, పెద్ది కృష్ణారెడ్డి నల్లబెల్లి గ్రామపంచాయతీకి 500 స్టీల్ ప్లేట్లను విరాళంగా మంగళవారం అందజేశారు. గ్రామంలో నిర్వహించే వివిధ సామాజిక, సాంస్కృతిక, శుభకార్యాలు, ఇతర సామూహిక కార్యక్రమాల్లో ప్లాస్టిక్ ప్లేట్ల వినియోగాన్ని నివారించాలనే సదుద్దేశంతో ఈ విరాళాన్ని అందించినట్లు వారు తెలిపారు. ప్లాస్టిక్ ప్లేట్ల వినియోగం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం కలగడమే కాకుండా, భవిష్యత్ తరాలకు కూడా ముప్పు వాటిల్లుతుందని పేర్కొన్నారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా స్టీల్ ప్లేట్లను వినియోగించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు దోహదపడటంతో పాటు, గ్రామంలో పరిశుభ్రతను పెంపొందించవచ్చని వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు చెట్టుపెల్లి మురళీధర్ రావు, నాగెల్లి ప్రకాష్, ఉపసర్పంచ్ గుమ్మడి వేణు, మాజీ సర్పంచ్ కొత్త పెల్లి కోటిలింగాచారి, పంచాయతీ కార్యదర్శి అనిల్, వార్డ్ మెంబర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల పేరుతో ఆదివాసీల భూములను లాక్కోవద్దు

ఇస్తున్నట్టు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. వందల ఏళ్లుగా పెనుగోలు ఆదివాసీలు ఎటువంటి ప్రభుత్వ సేవలకు నోచుకోలేదని ఆయన అన్నారు. విద్య, వైద్య సేవలు పొందలేదని అన్నారు. నేటికీ భారత దేశ పటం లో ఈ గ్రామానికి చోటు దక్కలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా పెనుగోలు గ్రామానికి రోడ్డు మార్గం లేదని, అనారోగ్య సమస్యలు వస్తే గుట్టల మధ్య నుండి జోలే కట్టి మోసుకురావడం తప్ప మరో మార్గం లేదన్నారు. పాములూరు, జెల్లా, దోలి, తడపల, చెలిమల, ముకునూరు గ్రామాలకు అక్కడ ప్రజలు లేకున్నా కోట్ల రూపాయలు వెచ్చించి రోడ్డు వేసిన ప్రభుత్వం పెనుగోలు గ్రామం లో ప్రజలు ఉన్నప్పటికీ రోడ్డు ఎందుకు వేయడం లేదని ఆయన అదనపు కలెక్టర్ ని ప్రశ్నించినట్టు తెలియజేసారు . కర్రెగుట్టలకు రోడ్డు వేయడానికి ఎటువంటి అంక్షలు పెట్టని అటవీ శాఖ పెనుగోలు గ్రామానికి రోడ్డు వేయడానికి ఎందుకు ఆంక్షలు పెడుతున్నారని అన్నారు. దేశ అత్యున్నత న్యాయస్థానం అడవి నుండి ఆదివాసీలను వేరు చేయడం, నీటి నుండి చేపను వేరు చేయడం ఒకటే అని వ్యాఖ్యానించినట్టు ఆయన తెలిపారు.

ఐదో పంచవర్షిక ప్రణాళికలో ఆదివాసీలు ఎక్కడ ఉంటే అక్కడే వాళ్ళను అభివృద్ధి చేయాలనీ అడవి నుండి బయటకు తెచ్చి నిర్వాసితులను చేయొద్దని చెప్పినట్టు గుర్తు చేశారు. వందల ఏళ్లుగా పెనుగోలు గ్రామానికి ప్రభుత్వ సేవలు అందలేదన్నారు. ఏనాడూ పెనుగోలు గ్రామాన్ని పట్టించుకోని ప్రభుత్వాలు వాళ్ళ భూములను మోడీకుంట ప్రాజెక్ట్ కు అప్పగించడానికి ప్రయత్నించడం సరికాదన్నారు. ఇన్నేళ్లు మాకు ప్రభుత్వం రోడ్డు వేయకపోయినా, వైద్య, విద్య సేవలు అందించకపోయినా, మా బ్రతుకు మేము బ్రతికినం కానీ ఇప్పుడు మా భూములను తీసుకోవద్దని ఆదివాసీలు మహేందర్ జీ ని వేడుకున్నట్లు వివరించారు. జపాన్ లాంటి దేశాల్లో ఒక విద్యార్థి కోసం రైలు వేశారని, ఆరుగురు ఆదివాసీలను రక్షించడానికి వారి కోసం ప్రత్యేక జోన్ ఏర్పాటు చేసారని ఇక్కడ ప్రభుత్వం ఆ విధంగా ఎందుకు చేయడం లేదన్నారు. పెనుగోలు గ్రామానికి పట్టాలు ఇచ్చే విధంగా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తా అని హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఏ ఎన్ ఎస్ జిల్లా అధ్యక్షులు ఎట్టి విద్యాసాగర్, ఏ ఎన్ ఎస్ సోషల్ మీడియా రాష్ట్ర అధికార ప్రతినిధి పాయం అజయ్, పాయం కృష్ణమూర్తి, బొగ్గుల నారాయణ, శివాజీ, ఉయిక సురేష్, రాజేష్ గోపాల్ తదితర రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కడియం కు కృతజ్ఞతలు తెలిపిన మున్సిపల్ చైర్మన్ వినయ్ కుమార్



స్టేషన్ ఘన్‌పూర్, నవంబర్ 03 (జనంసాక్షి) : స్టేషన్ ఘన్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శివుని పెల్లిలో గల 504 సర్వే నెంబర్ లో మూడు ఎకరాల భూమి డంపింగ్ యార్డ్ కోసం ఇచ్చినం దుకు స్టేషన్ ఘన్పూర్ మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్ మంగళవారం ఎమ్మెల్యే కడియం శ్రీహరి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ వినయ్ కుమార్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని శివుని పెల్లిలో డంపింగ్ యార్డ్ కోసం రెండు ఎకరాల భూమి ఉందని, అది సరిపోవడంలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి జిల్లా కలెక్టర్ తో మాట్లా డి అదనంగా మరోమూడు ఎకరాలు కేటాయించ డం జరిగిందని అన్నారు. డంపింగ్ యార్డ్ కోసం మూడు ఎకరాల భూమి ఇప్పించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరికి మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్ తోపాటు,కమిషనర్,కౌన్సిలర్లు,కో ఆప్షన్స్ సభ్యులు, మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది, ప్రజలు ఎమ్మెల్యే కడియం శ్రీహరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అవినీతి పరుల ఫోటోలు బయట పెట్టాలి!

జాతీయ మానవ హక్కుల కమిటి జిల్లా ప్రధాన కార్యదర్శి సంగెం రమేష్...



చెన్నారావుపేట, నవంబర్ 3 (జనంసాక్షి) : అవినీతి పరుల ఫోటోలు బయట పెట్టాలని జాతీయ మానవ హక్కుల కమిటి జిల్లా ప్రధాన కార్యదర్శి సంగెం రమేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో రోజు రోజుకు అవినీతికి పెరిగిపోతుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు చేస్తున్న అవినీతి సమాజంలో పురివిప్పి నాట్యమాడుతుందన్నారు. తెలంగాణలో అవినీతి, అక్రమాలకు ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజా నాయకులు ఎవ్వరు పాల్పడిన ప్రజా అవసరాల కార్యాలయాల్లో, ప్రధాన కూడలల్లో వారి ఫోటోలు ప్రదర్శించాలన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఏసీబీ దాడుల్లో లంచం తీసుకుంటూ పట్టుబడిన అధికారుల ఫోటోలను, వారు ఏ పని కోసం ఎంత లంచం డిమాండ్ చేశారో పూర్తి వివరాలతో నోటీసు బోర్డుపై ప్రజలకు కనిపించేలా ప్రదర్శించాలన్నారు. అవినీతిలో పట్టుబడిన వాళ్ళని సస్పెన్సు ఫనీష్ మెంట్ కాకుండా శాశ్వతంగా ఉద్యోగం నుండి తొలగించాలని వారి ఆదాయానికి మించిన ఆస్తిని ఏ రూపంలో ఉన్న ప్రజా ఖజానాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. అప్పుడే తెలంగాణలో అవినీతి అంతమవుతుందని అయన కోరారు.

వ్యవసాయ ట్రాక్టర్లతో వాణిజ్య రవాణా..

మూడు ట్రాక్టర్లు సీజ్..

జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి): వ్యవసాయ అవసరాలకు వినియోగించాల్సిన ట్రాక్టర్లతో వాణిజ్య రవాణా చేస్తున్న వారిపై భూపాలపల్లి రవాణా శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. మట్టిని తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను మంగళవారం సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. పట్టణంలోని మంజూరు నగర్, బాంబులగడ్డ ప్రాంతాల్లో సహాయ మోటారు వాహన తనిఖీ అధికారులు ఫహీమ సుల్తానా, శ్రీనివాస్ తనిఖీలు నిర్వహించగా వ్యవసాయానికి నమోదైన ట్రాక్టర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తూ మట్టి రవాణా చేయడం గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న మూడు ట్రాక్టర్లపై కేసులు నమోదు చేసినట్లు జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ తెలిపారు. వ్యవసాయ ట్రాక్టర్లను వాణిజ్య రవాణాకు వినియోగించడం నిబంధనలకు విరుద్ధమని, నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై తనిఖీలు కొనసాగించి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

వేసవిలో తాగునీటి ఇబ్బందులు రాకుండా చర్యలు

నిర్మల్ బ్యూరో, నవంబర్ 03,(జనం సాక్షి): రానున్న వేసవిలో పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి తెలిపారు. ఎస్సార్ఎస్పీ ప్రాజెక్టును అధికారులతో కలిసి సందర్శించి నీటి నిల్వలను పరిశీలించారు. ప్రస్తుతం వేసవి అవసరాలకు సరిపడా నీరు అందుబాటులో ఉందని, ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించాలని సూచించారు. పైపులైన్ లీకేజీలను గుర్తిస్తే వెంటనే అధికారులకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గోపు గోపి, పెండం శ్రీనివాస్, నాందేడపు చిన్ను, రఫీ, చెనిగరపు నరేష్, జకి, శ్రీకాంత్ యాదవ్, డీఈ హరిభువన్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే యశస్వినిరెడ్డిని కలిసిన మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అనూష



పాలకుర్తి, నవంబర్ 03 (జనంసాక్షి) : పాలకుర్తి మండల కాంగ్రెస్ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలుగా మహంకాళి అనూష– సురేష్ నూతనంగా నియామకమైన సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పదవులు చేపట్టిన ప్రతి ఒక్కరూ పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పోగు శ్రీనివాస్, పాలకుర్తి బ్లాక్ ఆత్మ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ,పార్టీ మండల నాయకులు గిరగాని కుమారస్వామి, వీరమనేని యాకాంతరావు, పెనగొండ రమేష్,జలగం కుమార్, నారగోని ఎల్లయ్య. నీరటి చంద్రయ్య వావిలాల సర్పంచ్ ఇల్లబెల్లి విమలమ్మ విజయ్ కుమార్, కోల అశ్వినీ వేణు,గుమ్మడిరాజు కొమురయ్య, శీల లింగయ్య, అనపర్తి బాబు, మల్లేష్,శ్రీను, సైదులు తదితరులు ఉన్నారు.

రైస్ ట్రేడర్స్ దుకాణాలలో జిల్లా అదనపు కలెక్టర్ రవి ఆకస్మిక తనిఖీలు

తక్కువ తూకం కలిగిన రైస్ బ్యాగులను విక్రయిస్తున్న రైస్ ట్రేడర్స్ యజమానిపై కేసు నమోదు



హనుమకొండ జిల్లా ప్రతినిధి నవంబర్ 3 (జనం సాక్షి) :హనుమకొండ నయీమ్ నగర్ లోని గణపతి రైస్ ట్రేడర్స్, చిదర సంపత్ కుమార్ ఫుడ్ గ్రేన్ డీలర్, శ్రీ శ్యామ్ ట్రేడర్స్ దుకాణాలలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, పౌర సరఫరాల శాఖ అధికారులు, తూనికలు కొలతలు శాఖల అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలను నిర్వహించారు. ఈ తనిఖీల సందర్భంగా రైస్ బ్యాగుల తూకాలు సరిగ్గా ఉన్నాయా లేదా పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రైస్ విక్రయాలు జరుగుతున్నాయా అని అడిగి తెలుసుకుని వాటి రికార్డులను తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు విక్రయాలు జరుగుతున్నాయా లేదా అని ఆరా తీశారు. కాగా గణపతి రైస్ ట్రేడర్స్ లో తనిఖీల సందర్భంగా అక్కడి బియ్యం బస్తాలను తూకం వేశారు. ఇందులో ఇరవై ఐదు కిలోల సంచులలో ఒక్కోదానిలో ఒకటి నుండి ఒకటిన్నర కిలోల వరకు తక్కువగా బియ్యం ఉన్నట్లు అదనపు కలెక్టర్, అధికారులు గుర్తించారు. వినియోగదారులను మోసం చేస్తూ తక్కువ బరువు కలిగి ఉన్న బియ్యం సంచులను విక్రయిస్తున్నందుకు గణపతి రైస్ ట్రేడర్స్ యజమానిపై ప్రభుత్వ నిబంధనల మేరకు కేసు నమోదు చేసినట్లు అదనపు కలెక్టర్ రవి తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రవి మాట్లాడుతూ రైస్ విక్రయ దుకాణాలలో ప్రభుత్వ నిర్దేశిత ధరలకు మాత్రమే విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా నిర్ణీత తూకం కంటే తక్కువ తూకం ఉన్న రైస్ బ్యాగులను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ తనిఖీలలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మహేందర్, డిప్యూటీ తహసీల్దార్ నాగేంద్రప్రసాద్, ఎన్ఫోర్స్ మెంట్ అధికారులు భద్రు నాయక్, భాస్కర్ రెడ్డి, తూనికలు కొలతల శాఖ అధికారులు విశ్వేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు నీటి పొదుపు పాటించాలి

రైతులకు అటవీ, వ్యవసాయ శాఖ అధికారుల అవగాహన



నెన్నెల, నవంబర్ 3 (జనం సాక్షి) : ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో ఎదురయ్యే వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించాలని అటవీ, వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నవంబర్ మొదటి వారంలో నీటి పొదుపుపై ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో భాగంగా నెన్నెల రైతు వేదిక వద్ద రైతులకు అవగాహన కల్పించారు. వన్యప్రాణులకు ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. దాహార్తితో వన్యప్రాణులు పంట పొలాల వైపు వచ్చినట్లయితే రైతులు వాటిని ఇబ్బందులకు గురిచేయకుండా వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నెన్నెల డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ బి. ప్రవీణ్ నాయక్, మండల వ్యవసాయ అధికారి సృజన, ఏఈఓ ధనలక్ష్మి, ఎఫ్‌బీఓ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపురం లో 17 కోట్ల తో అభివృద్ధి పనులకు శ్రీకారం

మంత్రి సీతక్క ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కృషితో నిధులు మంజూరు

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్



నూగూర్ వెంకటాపురం నవంబర్ 03(జనం సాక్షి): రాష్ట్ర మంత్రివర్యులు సీతక్క,భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ఆదేశాల మేరకు వెంకటాపురం మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారనీ వెంకటాపురం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్ తెలిపారు.మండలంలోని ఆర్ అండ్ బి రోడ్లు, పాలెం వాగుకు సంబంధించిన బ్రిడ్జిలు మంజూరు చేయడం జరిగిందని ప్రకటనలో పేర్కొన్నారు. 17 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు మంత్రి సీతక్క , భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ఎంతో కృషి చేశారని అన్నారు.ఈ అభివృద్ధి కార్యక్రమానికి మండల ప్రజలందరూ సహకరించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్ కోరారు.